ఈనాడు కర్ణాటక

ఆదివారం ఆగస్టు 30, 2026

విద్యాగంధం

బెంగళూరులోని జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (జిమ్)లో భారతీయ మేనేజ్‌మెంట్ విద్యాలయాల సంఘం (అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ స్కూల్స్-ఎయిమ్స్) 37వ వ్యవస్థాపక దినోత్సవం శనివారం పెద్దఎత్తున నిర్వహించారు. మేనేజ్‌మెంట్ విద్యపై ఏఐఎంఎస్ కోశాధికారి ఆచార్య పి. నారాయణరెడ్డి రాసిన పుస్తకాన్ని కార్యక్రమ వేదికపై ఆవిష్కరిస్తున్న 'మార్గదర్శి' చిట్‌ఫండ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ శైలజాకిరణ్‌తో పాటు న్యాక్ ఛైర్మన్ ఆచార్య నాగేశ్వరరావు, ఏఐఎంఎస్ అధ్యక్షుడు డాక్టర్ పరాగ్ కెల్కర్, మాజీ అధ్యక్షులు డాక్టర్ రామస్వామి నందగోపాల్, ఆచార్య అనిల్ ఫిలిప్, చంద్ర గ్రూప్ ప్రముఖులు నందిని రంగస్వామి తదితరులు. కార్యక్రమానికి విచ్చేసిన విద్యారంగ ప్రముఖులనూ చిత్రంలో చూడొచ్చు..

- ఈనాడు, బెంగళూరు

'మాజీ ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే శతజయంతి' వేడుకల్లో పాల్గొన్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి, కర్ణాటక మంత్రి బసవరాజ రాయరెడ్డి, మాజీ మంత్రి దేశ్‌పాండే తదితరులు

రాజనీతిజ్ఞుడు.. రామకృష్ణ హెగ్డే

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : కార్వార వైద్య కళాశాలకు, బెంగళూరులోని శివరామ కారంత్ లేఅవుట్‌లో ఒక ప్రధాన వీధికి రామకృష్ణ హెగ్డే పేరు పెడతామని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. పంచాయతీల్లోనూ హెగ్డే పేరిట పురస్కారాలను ప్రదానం చేస్తామని వెల్లడించారు. నాయకులను సృష్టించిన నాయకుడు హెగ్డే అని గుర్తు చేశారు. ఆయన ఆదర్శాలు, అభివృద్ధికి సంబంధించిన ఆలోచనలను తదుపరి తరాలకు చేర్చవలసిన బాధ్యత ప్రతి నాయకునికీ ఉందన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే శతాబ్ది ఉత్సవాలను ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులతో కలిసి శనివారం ప్రారంభించి డీకే మాట్లాడారు. హెగ్డే పేరు శాశ్వతంగా నిలిచి ఉండేలా ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోందని చెప్పారు. కేవలం అధికారం కోసమే కాకుండా, ప్రజల కోసం, వారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వివిధ కార్యక్రమాలను ఆయన అమలు చేశారని గుర్తు చేశారు. కులాలకు అతీతంగా విలువ ఆధారిత కార్యక్రమాలను జారీ చేశారని చెప్పారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ. 3687 కోట్ల బడ్జెట్ ఈ ఏడాదికి రూ.4.5 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. నాడు తక్కువ రాబడి ఉన్నప్పటికీ ప్రజారంజక పథకాలను అమలు చేశారని వివరించారు. కనకపుర నుంచి తాను రాజకీయాల్లోకి రావడానికి హెగ్డే, పీజీఆర్ సింధ్యా కారణమన్నారు. హెగ్డే ప్రభావం ఎక్కువగా ఉండడంతో తాను మొదటి ఎన్నికల్లో ఓడిపోయానని, అప్పుడు కూడా గెలిచి ఉంటే మొత్తం 9 సార్లు ఎమ్మెల్యే అయి ఉండేవాడినని అన్నారు. హెగ్డేలో రాముని ఆదర్శం, కృష్ణుని రాజకీయ చాణక్యం ఉన్నాయని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. సిద్ధరామయ్య, ఆర్‌వీ దేశ్‌పాండే, బసవరాజ రాయరెడ్డి, బీఎల్ శంకర్, తదితరులను రాజకీయాల్లో హెగ్డే ప్రోత్సహించారని గుర్తు చేశారు.

వెంకయ్యతో కరచాలనం చేస్తున్న డీకే శివకుమార్

మరో భిక్షగత్తె ఇంట పెద్ద మొత్తంలో నగదు

మండ్య, న్యూస్‌టుడే : మొన్నటికి మొన్న మండ్య నగరంలో ఓ భిక్షగత్తె ఇంట భారీగా నిధుల మూటలు వెలుగు చూడగా.. ఇపుడా వంతు శ్రీరంగపట్టణానికి వచ్చింది. ఈ పట్టణానికి చెందిన సావిత్రమ్మ (65) అనే భిక్షగత్తె వయోసహజ అనారోగ్య సమస్యలతో మరణించింది. ఆమె ఇంట్లో 10 చిన్న మూటల్లో నాణేలు లభించాయి. అవి రూ.62 వేలు కాగా, రెండు మూటల్లో రూ.1.85 లక్షల కరెన్సీ నోట్లు లభించాయి. వాటన్నింటినీ ప్రస్తుతానికి బ్యాంకులో జమ చేయించామని వైదిక క్రియలు నిర్వహించే భానుప్రకాశ్ తెలిపారు.

మంత్రి ప్రియాంక్ ఖర్గేకు బెయిలు మంజూరు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : సంఘ పరివార్‌ను అవహేళన చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న హోం మంత్రి ప్రియాంక్ ఖర్గే, యువ కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ నలపాడ్‌కు 42వ ఏసీజేఎం న్యాయస్థానం ముందస్తు బెయిలు మంజూరు చేసింది. తమ ముందు వ్యక్తిగతంగా హాజరు కావాలని న్యాయమూర్తి సమన్లు జారీ చేయడంతో కోర్టుకు వచ్చారు. ఇద్దరూ తలా రూ.10 వేల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించిన అనంతరం ముందస్తు బెయిలు మంజూరు చేశారు.

భారీగా అధికారుల బదిలీలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఆయా జిల్లాల్లో 21 మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బెళగావికి నూతన కమిషనర్‌గా నికమ్ ప్రకాశ్ అమృత్, పశ్చిమ వలయం డీఐజీపీగా ఆర్.చేతన్, నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా శివప్రకాశ్ దేవరాజును నియమించారు. హరిశేఖరన్‌ను పౌర హక్కుల జారీ డైరెక్టరేట్‌కు, దేవజ్యోతి రేను నేరాలు, సాంకేతిక సేవల ఏడీజీపీగా, ఎం.నంజుండస్వామిని ఫిర్యాదులు, మానవ హక్కుల ఏడీజీపీగా బదిలీ చేశారు.

రాజీనామా రాజకీయం

● నాగేంద్ర దిగిపోయినా తగ్గని విపక్ష నాయకులు

బళ్లారి.. ఆ పేరు చెబుతూనే 'బిసిలినాడు' గుర్తుకు వస్తుంది. మండే ఎండలకు నట్టిల్లు ఈ నగరం. ఇక్కడి రాజకీయాల్లో మరోసారి మంటలు రేగాయి. కాంగ్రెస్ పార్టీ ఆ మంటలను అధిగమించి.. దూసుకుపోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ పోరాటంలో ముఖ్యమంత్రి డీకే, తాజాగా మంత్రి పదవికి రాజీనామా చేసిన నాగేంద్ర కీలకంగా మారారు.

డీకే ఎత్తుగడ ఏమిటో..

ఈనాడు, బెంగళూరు : కొత్త ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కుదురుగా పాలనపై దృష్టి సారించలేని పరిస్థితి. అతి కష్టం మీద మంత్రివర్గాన్ని విస్తరించినా నాగేంద్ర రూపంలో రాజీనామా వివాదం పంటికింద రాయిలా మారింది. మరోవైపు మంత్రివర్గంలో చోటు దక్కని సీనియర్లు సర్కారుకు సహాయ నిరాకరణకు సిద్ధమయ్యారు. ఇవన్నీ కాదని భాజపా నేతృత్వంలో త్వరలో చేపట్టే పాదయాత్ర పార్టీ అధిష్ఠానాన్ని కూడా కలచివేస్తోంది.

పగబట్టిన నాగేంద్ర

స్థానిక పోరు కాక..

అవినీతి ఆరోపణలతో మంత్రి పదవికి బి.నాగేంద్ర రాజీనామా చేయటంతో ప్రత్యక్షంగానే భాజపాకు మంచి చేసింది. ఆయన రాజీనామా ఇంకా ఆమోదించని ముఖ్యమంత్రి వేచి చూసే ధోరణిని అవలంచటంతో ఇరు వైపులా రాజకీయ పరిణామాలు ఊపందుకున్నాయి. రాజీనామా చేసే రోజున బళ్లారి నేతల లక్ష్యంతో సవాళ్లు విసిరిన నాగేంద్ర సొంత పార్టీకి సంకటాన్ని మిగిల్చారు. కన్నడనాట పాదయాత్రలు రాజకీయ పార్టీ భవిష్యత్తును తేలుస్తుంటాయి. 2010లో సిద్ధరామయ్య చేసిన పాదయాత్ర ఆయనతో పాటు కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్తును సమూలంగా మార్చింది. 2013లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్‌కు ముఖ్యమంత్రిగా పని చేసిన సిద్ధరామయ్య రికార్డు స్థాయిలో ఆ పదవిని అలంకరించారు. బెంగళూరు నుంచి బళ్లారి వరకు దాదాపు 350కి.మీల వరకు పాదయాత్ర చేసిన సిద్ధరామయ్య లక్ష్యం గాలి జనార్దనరెడ్డి సోదరుల అవినీతి ఆరోపణలే. సరిగ్గా 16ఏళ్ల తిరిగే సరికి ఇదే బళ్లారి నేత నాగేంద్ర అవినీతి కోసం భాజపా పది రోజుల పాదయాత్రకు సిద్ధమైంది. ఈ యాత్రకు అడ్డుకట్ట వేయాలని నాగేంద్రతో రాజీనామా చేయించిన డీకే వ్యూహాన్ని తిప్పి కొట్టిన భాజపా శనివారం పాదయాత్రకు పిలుపునిచ్చింది.

ఈ యాత్రను అడ్డుకునే దిశగా నాగేంద్రతో రాజీనామా చేయించినా భాజపా నేతలు తగ్గేదేలే అంటూ కాంగ్రెస్‌కు సవాళ్లు విసురుతున్నారు. విధానసభ ఎన్నికలకు పట్టుమని ఏడాది సమయం కూడా లేని వేళ డీకేకు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి.

రాజకీయ రణక్షేత్రం

విజయనగరతో కూడిన ఉమ్మడి బళ్లారి జిల్లాలో సంప్రదాయబద్ధంగా కాంగ్రెస్‌దే పై చేయి. కానీ గాలి జనార్దన్‌రెడ్డి సోదరులు, బి.శ్రీరాములు ప్రభావంతో క్రమంగా భాజపా ప్రభావం కనిపించింది. ఆపై గనుల కేసులతో తల్లడిల్లుతూ బళ్లారిలో అడుగుపెట్టని జనార్దన్‌రెడ్డి కారణంగా మళ్లీ కాంగ్రెస్ నేతల హవా కొనసాగింది. ప్రస్తుత విధానసభలోనూ బళ్లారి, విజయనగర జిల్లాల్లో మొత్తం పది నియోజకవర్గాలుండగా కాంగ్రెస్ నేరుగా తొమ్మిదింట సత్తా చాటింది.

సవాళ్లు తెచ్చిన చిచ్చు

బి.నాగేంద్ర అవినీతి ఆరోపణల నుంచి బయటపడాల్సింది సీబీఐ, ఈడీ విచారణ ద్వారానే. కానీ ఎమ్మెల్యేగా రాజీనామా చేసి ప్రజా క్షేత్రంలో నిర్దోషినని నిరూపించుకుంటానని ప్రకటించటంతో కాంగ్రెస్ నాయకత్వం కూడా నాలుక కరచుకుంది. పార్టీతో ఏమాత్రం చర్చించకుండా ఉద్వేగంతో తాను ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తానని ప్రకటించిన నాగేంద్రను కేపీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్ బుజ్జగించారు. ఆలోగా నాగేంద్ర సవాలు స్వీకరించిన గాలి జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరాములు విలేకరుల సమావేశంలో తీవ్రంగా విరుచుకుపడ్డారు. వీరి లక్ష్యం నాగేంద్ర అయినా ఈ సవాళ్లతో నష్టపోయేది మాత్రం కాంగ్రెస్ పార్టీనే అసలే కేసుల కారణంగా ఎస్టీ అభివృద్ధి మండలి బ్యాంకు ఖాతాలన్నీ స్తంభించి పోవటంతో ఈ సామాజిక వర్గానికి ఏ సాయం అందని పరిస్థితి. ఇందుకు కారణం నాగేంద్ర రాద్ధాంతమే కారణమని బళ్లారిలోని గిరిజన ఓటర్లు భావిస్తే నష్టం జరిగేది కాంగ్రెస్‌కే. రాజకీయ సవాళ్ల మాటెలా ఉన్నా..రాజీనామాలతో, కాంగ్రెస్‌కే నష్టం. ఆ పార్టీ బళ్లారి పరిధిలోని 10స్థానాల్లో గెలిచింది ఒక్క సీటు మాత్రమే. పైగా ఎస్టీ నిధులు ఎంపీ తుకారాం ప్రచారం కోసం వినియోగించారన్న కొత్త ఆరోపణతో భాజపా సభ్యులు చేస్తున్న ప్రచారం కాంగ్రెస్‌కు మరింత సంకటాన్ని తెస్తోంది.

India's No.1
BEST FILTER COFFEE PARTNER
TRUSTED SINCE 1987
IS:612
JYOTHI
SUPER DELUX
CHICORY
Call : 98660 12915

జ్ఞానేంద్రకుమార్ విచారణ కొనసాగింపు

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : కర్ణాటక పబ్లిక్ సర్వీసు కమిషన్ చేపట్టిన పశు వైద్యాధికారుల నియామక ప్రక్రియలో అవకతవకలకు సంబంధించి ఐఏఎస్ అధికారి జ్ఞానేంద్ర కుమార్ విచారణ కొనసాగింది. శుక్రవారం తొమ్మిది గంటల పాటు ఆయనను సీఐడీ అధికారులు విచారణ చేశారు. ఆగస్టు 18 నుంచి అజ్ఞాతంలో ఉన్న ఆయన హఠాత్తుగా బెంగళూరుకు శుక్రవారం వచ్చారు. తాను సెలవులో ఉన్నానని, తనను కలుసుకున్న విలేకరులకు తెలిపారు. రాత్రి తొమ్మిది గంటల వరకు విచారణకు హాజరై, మళ్లీ శనివారం సీఐడీ కార్యాలయానికి వచ్చారు. అధికారి రాఘవేంద్ర హెగ్డే నేతృత్వంలోని సిబ్బంది జ్ఞానేంద్రను సుదీర్ఘంగా విచారించారు.

వైద్య కళాశాలల క్యాంటీన్లకు తాఖీదులు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : గడువు మీరిన ఆహారాన్ని విద్యార్థులకు విక్రయిస్తున్న ఆరోపణలపై ఐదు వైద్య కళాశాలల క్యాంటీన్లకు ఆహార సురక్షిత విభాగం అధికారులు శనివారం తాఖీదులు జారీ చేశారు. ఇటీవల నిర్వహించిన సోదాల్లో మొత్తం 34 క్యాంటీన్లు, వంటగదుల్లో అపరిశుభ్రత గుర్తించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాల ప్యాకెట్లు, ప్యాకేజింగ్ ఆహారం ఉన్నట్లు గుర్తించారు. వీటిలో నూనె, పాలు, చిరుతిండ్లు ఉన్నాయి. తదుపరి విచారణకు వారిని జిల్లా అదనపు మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తామని అధికారులు శనివారం ప్రకటించారు.

శ్రీకి విన్నపం తిరస్కరణ

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : బిట్ కాయిన్ లావాదేవీలు, ప్రభుత్వ వెబ్‌సైట్ల హ్యాకింగ్‌తో అక్రమాలకు పాల్పడి అరెస్టైన హ్యాకర్ శ్రీకృష్ణ అలియాస్ శ్రీకి, క్రిప్టో కరెన్సీ ట్రేడర్ రాబిన్ ఖండేవాలా బెయిలు కోసం వేసుకున్న అర్జీలను ఈడీ ప్రత్యేక కోర్టు తోసిపుచ్చింది. వీరిద్దరూ గత మే నుంచి పరప్పన అగ్రహార కారాగారంలో ఉంటున్నారు. వారికి బెయిలు మంజూరు చేయవద్దని ఈడీ తరఫు న్యాయవాది మధు ఎస్.రావు విన్నపాన్ని పరిగణనలోకి తీసుకుని వారి అర్జీని న్యాయమూర్తి తోసిపుచ్చారు.

ఇన్నాళ్లకు.. కటకటాలపాలు

మంగళూరు, న్యూస్‌టుడే : పలు సంవత్సరాలుగా విచారణకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు నిందితులను మంగళూరు తూర్పు, వేణూరు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఎనిమిదేళ్లుగా పరారీలో ఉన్న ముజాజ్ కేరళంలో తలదాచుకున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. 13 ఏళ్ల నుంచి తప్పించుకు తిరుగుతున్న కె.శ్రీనివాస్ అలియాస్ సీనప్ప (43)ను వేణూరు పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరినీ న్యాయస్థానం ముందు హాజరు పరచగా, న్యాయనిర్బంధానికి పంపిస్తూ న్యాయమూర్తి ఆదేశించారు.

రహదారుల పొడవునా కల్పతరువులు!

మైసూరు, న్యూస్‌టుడే : రహదారుల పక్కన, ప్రభుత్వ స్థలాలు, రైతుల భూముల్లో కల్పతరువులుగా పేరొందిన కొబ్బరి మొక్కలు నాటించే 'తేగద సిరి' కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకువస్తుందని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. ఈ పథకానికి సహకరించే రైతులకు 70 శాతం, ప్రభుత్వానికి 30 శాతం లాభాలను పంచుకుంటామన్నారు. దీని కోసం కోటి కొబ్బరి మొక్కలను అటవీశాఖ సహకారంతో పంపిణీ చేస్తామని వెల్లడించారు. తనకు దొరికిన అధికారం, అవకాశాన్ని పూర్తిగా జనసేవకే కేటాయిస్తానని చెప్పారు. ఇచ్చిన మాటను నెరవేర్చే వారే నిజమైన నాయకులన్నారు. మహారాష్ట్రలో గ్యారంటీ పథకాలకు ప్రకటించి, వాటిని అమలు చేయలేదన్నారు. విద్యా విప్లవానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు మఠాలు మద్దతు ఇవ్వడాన్ని అభినందించారు. భూమి, నీరు, భాష విషయంలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా ఒకే తాటిపై ఉండాలన్నారు. శివరాత్రి రాజేంద్ర స్వామి 111వ జయంతిని మఠాధిపతి శివరాత్రి దేశికేంద్ర స్వామి, సిద్ధలింగ స్వామి, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రి యతీంద్ర తదితరులతో కలిసి శనివారం ప్రారంభించి మాట్లాడారు. వచ్చే పాతికేళ్లలో పచ్చదనం ఎక్కువగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఎస్ఎం కృష్ణ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆదిచుంచనగిరి మఠాధిపతి బాలగంగాధరనాథ స్వామితో కలిసి ఐదు కోట్ల మొక్కలు పంచారని గుర్తు చేశారు. కావేరి నది ఆధారిత మేకెదాటు పథకంతో తమిళనాడుకు కూడా ప్రయోజనం ఉంటుందని అక్కడి ముఖ్యమంత్రి విజయ్ జోసెఫ్‌కు చెప్పానన్నారు. తుంగభద్ర విషయంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో చర్చించామన్నారు. ఆలమట్టి, కేఆర్‌ఎస్‌లో పూడిక తీత పనుల కార్యాచరణ చేపట్టేందుకు కేంద్రం ఇప్పటికే ప్రత్యేక విధానాన్ని రూపొందించిందని తెలిపారు. శివరాత్రి, సిద్ధగంగ మఠాలు ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి, అన్నదాసోహకు పెద్ద పీట వేశాయని కీర్తించారు. ఆకలికి అన్నం, మనసు ఆకలికి ప్రార్థన అవసరం అన్నారు. కర్ణాటకలో 46,302 ప్రాథమిక పాఠశాలలు, 24 వేల ప్రైవేటు పాఠశాలలు ఉండగా, వరుసగా 36 లక్షలు, 57 లక్షల మంది చదువుకుంటున్నారని తెలిపారు. వారందరి శ్రేయస్సుకు రాష్ట్రంలోని అన్ని మఠాలు ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాయని కొనియాడారు.

మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కరచాలనం చేస్తున్న డీకే శివకుమార్

మఠాధిపతులు, నేతలతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న డీకే శివకుమార్

గ్రేటర్ ఎన్నికలకు కొత్త ఓటరు జాబితా

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : సర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం జీబీఏ ఎన్నికల కోసం కొత్తగా ఓటరు జాబితాను ప్రకటిస్తామని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీనికి సంబంధించి ఉన్నత న్యాయస్థానంలో కమిషన్ ప్రమాణపత్రాన్ని దాఖలు చేసింది. సర్ ప్రక్రియలో పలు లోపాలు ఉన్నాయని బెంగళూరు నవ నిర్మాణ వేదికె వేసిన అర్జీని జస్టిస్ విభు బఖ్రు, జస్టిస్ హేమలత పీఠం విచారణ చేపట్టింది. లోపాలు సరి చేస్తున్నామని, ఫారం- 6 ద్వారా అర్హులకు జాబితాలో చోటు కల్పిస్తున్నామని కమిషన్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి అందించిన ప్రమాణ పత్రంలో పేర్కొన్నారు. అన్నీ అనుకూలిస్తే రాజకీయ పార్టీలన్నీ గ్రేటర్ ఎన్నికలకు సిద్ధం కావాల్సిందే. ఈ ఎన్నికల విషయంలోనే ప్రధాన పార్టీలు ఇప్పటికే పరస్పర ఆరోపణల్లో మునిగి తేలుతున్నాయి.

పాదయాత్ర.. భాజపా తగ్గేదేలే

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మంత్రి పదవికి బి.నాగేంద్ర రాజీనామా చేసినా లింగసుగూరు నుంచి బళ్లారి వరకు 9 నియోజకవర్గాల్లో పాదయాత్ర కొనసాగిస్తామని భాజపా నేత, మాజీ మంత్రి బి.శ్రీరాములు స్పష్టం చేశారు. సెప్టెంబరు 1 నుంచి 10 వరకు కొనసాగే పాదయాత్రకు జనతాదళ్ నేతలు, కార్యకర్తలు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. కేంద్ర మంత్రులు కుమారస్వామి, ప్రహ్లాద్ జోషి తమ యాత్రలో పాల్గొంటారని వివరించారు. పాదయాత్రకు సంబంధించిన లాంఛనాన్ని పార్టీ ప్రధాన కార్యాలయం జగన్నాథ భవన్‌లో ఆయన విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ నేతల అక్రమాలు, మహర్షి వాల్మీకి కార్పొరేషన్‌లో అక్రమాలతో వచ్చిన నగదు వితరణ చేసి తమ ప్రాంతంలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారని ఆరోపించారు. మస్కి, సింధనూరు, కారటగి, గంగావతి, కంప్లి, సండూరు, బళ్లారి గ్రామీణ నియోజకవర్గాల నుంచి చివరిగా బళ్లారికి చేరుకుని అక్కడ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని వివరించారు. తన పదవికి రాజీనామా చేసిన సందర్భంలో నాగేంద్ర కన్నీరు కార్చారని, దానికి కాంగ్రెస్ కారణమన్నారు. భాజపా 2013లో అధికారంలోకి వచ్చినప్పుడు తమతోనే ఉన్న నాగేంద్ర.. ఇప్పుడు రాజకీయ జన్మనిచ్చిన పార్టీపైనే ఆరోపణలు, విమర్శలు చేయడం శోచనీయమన్నారు. కుంభకోణంలో దళిత సముదాయానికి చెందిన అధికారి చంద్రశేఖర్ ఆత్మహత్యకు నాగేంద్ర బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

పోస్టర్లను ప్రదర్శిస్తున్న శ్రీరాములు, ఇతర నేతలు

నడువీధిలో తల్వార్లతో యువకుడి నరికివేత

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : బనశంకరి లేఅవుట్‌లో నడుచుకుని వెళుతున్న వ్యక్తిని తల్వార్లతో వచ్చిన ఇద్దరు యువకులు దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన బాధితుడు అక్కడికక్కడే మరణించాడు. ఆ వ్యక్తిని గుర్తించవలసి ఉందని నగర పోలీసు కమిషనర్ శశికుమార్ తెలిపారు. బైకుపై వెళుతున్న అతన్ని అడ్డగించిన నిందితులు తల్వార్లతో దాడి చేయడాన్ని ఒక స్థానికుడు చరవాణిలో చిత్రీకరించినట్లు గుర్తించారు. దాని ఆధారంగా విద్యానగర ఠాణా పోలీసులు నిందితుల కోసం గాలింపు తీవ్రం చేశారు.

మూల రామా విజయతే

కర్నూలు జిల్లా మంత్రాలయంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు, సప్తరాత్రోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజైన శనివారం స్వామి వారి పూర్వారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీమఠంలో పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు సంస్థాన పూజలను నిర్వహించారు. మూల రామచంద్రుడు, లక్ష్మీనరసింహ స్వామి, సంతాన గోపాల కృష్ణుడికి పంచామృతాభిషేకంతో పాటు విశేష పూజలు చేశారు. చిత్రంలో.. మూల రాముడిని ఆరాధిస్తున్న పీఠాధిపతి

- న్యూస్‌టుడే, మంత్రాలయం

అజ్మల్‌కు కిరీటం

కల్యాణ కర్ణాటక ప్రాంతంలో కీలక నగరం.. కలబురగి మేయర్ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. కొత్త మేయర్‌గా అజ్మల్ అహ్మద్ గోలా, ఉప మేయర్‌గా ఫరానా ఖుస్రో జాగీర్దార్ ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. పలువురు అధికారులు, నగర ప్రముఖులు వారిని అభినందనలతో ముంచెత్తారు. నగరానికి రానున్న వేసవిలో నీటిఎద్దడి ఎదురు కాకుండా చర్యలు తీసుకుంటానని అజ్మల్ ఈ సందర్భంగా హామీనిచ్చారు.

- న్యూస్‌టుడే, కలబురగి

హనూరు నివేదిక సిద్ధం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : హనూరు తాలూకా కావేరి వన్యధామలో ఆగస్టు 15న వేకువ జామున సంభవించిన కాల్పుల ఘటనకు సంబంధించి సిద్ధం చేసిన నివేదికను జిల్లాధికారి శ్రీరూప ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్‌కు శనివారం అందజేశారు. కరడికల్లు గుడ్డ వద్ద కాల్పుల్లో ఆంథోణి స్వామి, పీటర్, కుమార్ అనే వ్యక్తులు మరణించారు. ఇవి ఎదురు కాల్పులు కావని, ఎన్‌కౌంటర్ అని ఆంథోణి స్వామి భార్య లూర్దా మేరి ఆరోపించడంతో ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. నివేదికను పరిశీలించి, దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని శాలిని రజనీశ్ తెలిపారు.



నివేదిక అందుకుంటున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్

రెండు కార్లు ఢీ.. ఐదుగురి దుర్మరణం

బెంగళూరు (గ్రామీణ), న్యూస్‌టుడే : ఎదురెదురుగా వేగంగా దూసుకొచ్చిన రెండు కార్లు ఢీకొని ఐదుగురు దుర్మరణం చెందారు. తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్లి సమీప గోడెకెరె గేట్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చిక్కనాయకనహళ్లి నివాసి అనిల్ (32), వివేక్ (31), తురువెకెరకు చెందిన దావుద్‌బాషా, ఆయన కుమార్తెలు ఆనం (2), సీమా ఫాతిమా (6) ఈ ప్రమాదంలో మరణించారని తుమకూరు ఎస్పీ అశోక్ ధ్రువీకరించారు. తురువెకెర, చిక్కనాయకనహళ్లి వైపు నుంచి ఈ రెండు కార్లు శనివారం ఉదయం దూసుకొచ్చినట్లు గుర్తించారు. ప్రమాదంలో రెండు వాహనాలూ పూర్తిగా దెబ్బతిన్నాయి.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

కలియుగ స్వయం ప్రకటిత శంబుకుడు నాగేంద్ర

గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి ధ్వజం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాలి జనార్దన్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, భాజపా రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.దివాకర్

బళ్లారి, న్యూస్‌టుడే: వాల్మీకి అభివృద్ధి మండలి నిధుల మళ్లింపు కేసులో ప్రధాన పాత్రధారి బి. నాగేంద్ర కలియుగ స్వయం ప్రకటిత శంబుకుడు.. మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. తాను చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి కన్నీళ్లు పెట్టుకుని సానుభూతి పొందడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజీనామా చేయడానికి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జై పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలు చేసిన రాజ్యసభ సభ్యుడు సయ్యద్ నాసిర్ హుసేన్‌ను పక్కన కూర్చోబెట్టుకుని మాట్లాడారు. శంబుకుడి కథ నాగేంద్రకు తెలుసా? వాల్మీకి గురించి మాట్లాడే హక్కు నాగేంద్రకు లేదన్నారు. కలియుగంలో అసలైన శంబుకుడు. ఆత్మహత్య చేసుకున్న చంద్రశేఖర్. దీనికి కారణమైన నాగేంద్ర, కాంగ్రెస్ పార్టీ వాల్మీకి అభివృద్ధి మండలి నిధుల దుర్వినియోగంలో తనకు ఎలాంటి పాత్ర లేదని చెప్పుకొంటున్న ఆయన సదరు పత్రాలను మీడియాకు బహిర్గతం చేయాలన్నారు.

భాజపాలో ఆయన ప్రస్థానం మొదలు

నాగేంద్రకు రాజకీయ భిక్ష పెట్టింది నేను.. అతని రాజకీయం భాజపా నుంచి ప్రారంభమైందని మరిచిపోయారా? అని గాలి ప్రశ్నించారు. వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్లు దోచుకున్న నాగేంద్ర ఇప్పుడు అహంకారంగా మాట్లాడుతున్నారు. ఆయనో మూర్ఖుడు, అహంకారి. చంద్రశేఖర్ ఈయన కారణంగానే ఆత్మహత్య చేసుకున్నారని, ఆ కుటుంబం ఉసురు తగలడంతోనే కర్మఫలం వల్ల కన్నీరు కార్చుతున్నారని పేర్కొన్నారు. వాల్మీకి అభివృద్ధి మండలి నుంచి ముంబయికి చెందిన ముగ్గురికి నిధులు వెళ్లాయి. వారిలో నేహ కలాం మన్సూరి, జహద్ కలాం మన్సూరి, కలాం షకూర్ మన్సూరిల బ్యాంకు ఖాతాలకు రూ.6.50 కోట్లు నిధులు మళ్లించారన్నారు. వారెవరో నాగేంద్ర వెల్లడించాలని గాలి డిమాండ్ చేశారు.

ఆ నిధులు ఎన్నికలకు ఖర్చు చేశారు

వాల్మీకి అభివృద్ధి మండలి నిధులు బళ్లారి లోక్‌సభ, తెలంగాణ రాష్ట్ర ఎన్నికలకు ఖర్చు చేశారు. లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ వాల్మీకి సముదాయంపై ప్రేమ ఉంటే తక్షణమే రాజీనామా చేయాలని గాలి డిమాండ్ చేశారు. ఉమ్మడి బళ్లారి జిల్లాలోని 10 మంది ఎమ్మెల్యేలతో పాటు.. లోక్‌సభ సభ్యుడు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్దాం. 10 క్షేత్రాలతో పాటు లోక్‌సభ సభ్యుడిని గెలిపించుకుంటామని, కాంగ్రెస్ అభ్యర్థులకు డిపాజిట్ దక్కవని సవాల్ చేశారు. నాగేంద్ర ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్తే.. బి.శ్రీరాములు పోటీ చేస్తారా? అని ప్రశ్నించగా.. వాల్మీకి సముదాయంలో సామాన్య కార్యకర్తకు సైతం బి.నాగేంద్ర సమానం కాదన్నారు. బళ్లారి లోక్‌సభ నియోజకవర్గానికి ఎన్నికలకు వాల్మీకి అభివృద్ధి నిధులు ఖర్చు పెట్టారు. అదే డబ్బుతో ఇ.తుకారామ్ ఎంపీ అయ్యారు. ఇప్పుడు ఆయన భార్యకు మంత్రి పదవి ఇస్తే భాజపా వ్యతిరేకిస్తుందని జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. నాగేంద్ర రాజీనామా చేసినా రాయచూరు నుంచి బళ్లారికి భాజపా పాదయాత్ర కొనసాగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, కె.ఎస్.దివాకర్, హనుమంతప్ప, తదితరులు పాల్గొన్నారు.

బాలలు, మహిళల అపహరణ నియంత్రణకు సమష్టి కృషి

సమావేశంలో పాల్గొన్న ఎస్పీ డా.డి.సుమన్ పెన్నేకర్, న్యాయమూర్తి రాజేష్ ఎన్.హొసమని, ఏఎస్పీ నవీన్‌కుమార్ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లాలో అపహరణకు గురైన, తప్పిపోయిన బాలలకు సంబంధించి దాఖలైన ఫిర్యాదులను సమీక్షించడానికి శనివారం జిల్లా పోలీస్ అధికారి కార్యాలయంలో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్, జిల్లా పోలీస్ అధికారి డా.డి.సుమన్ పెన్నేకర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రత్యేక కార్యదళం 2020 నుంచి 2026 వరకు తప్పిపోయిన బాలలను గుర్తించడానికి తీసుకోవాల్సిన చర్యలు, బడి బయట ఉన్న పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించడానికి చేపట్టిన చర్యలు, భిక్షాటన నుంచి బాలలకు రక్షణ, బాల్య వివాహాల నుంచి విముక్తికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. బాలకార్మికులుగా పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికుల బాలలను గుర్తించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. బాల కార్మికులను నియమించుకునే వారిపై చట్టపరమైన చర్యలు, జిల్లా అక్కా ఫోర్స్ (అక్క పడె కార్యనిర్వహణ) పనితీరు, మహిళలు, బాలల రక్షణ కోసం ఇప్పటివరకు పాఠశాలల, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ ప్రదేశాలకు చేసిన పర్యటనల వివరాలపై చర్చించారు. రాబోయే రోజుల్లో వసతినిలయాలు, మురికివాడల ప్రాంతాల పర్యటనలు, అవగాహన కోసం సూచనలు, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదైన బాల్య గర్భాల కేసులపై తదుపరి చట్టపరమైన చర్యలు, మోసపూరిత పోలీస్ సిబ్బంది ఉన్న మురికివాడల ప్రాంతాలను సందర్శించాలని సూచనలు చేశారు. మాదకద్రవ్యాలు- దుష్ప్రభావాలపై అవగాహనతో సహా ఇతర అంశాలపై ఎస్పీ, న్యాయమూర్తి రాజేష్ ఎన్.హొసమని అధికారులతో చర్చించారు. ఏఎస్పీ నవీన్‌కుమార్, మహిళా, శిశు అభివృద్ధి శాఖ చెందిన త్రివేణి పత్తార్, వివిధశాఖాధికారులు పాల్గొని సలహాలు ఇచ్చారు.

5న కూడ్లిగికి సీఎం రాక

హొసపేటె, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన ప్రజాసేవ శాఖ ప్రారంభోత్సవ రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని సెప్టెంబరు 5న విజయనగర జిల్లా కూడ్లిగిలో సీఎం డి.కె.శివకుమార్ ప్రారంభిస్తారని జిల్లా పాలనాధికారి కవితా ఎస్.మన్నికేరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో కూడ్లిగి తాలూకాకు సంబంధించిన వినతులను మాత్రమే స్వీకరిస్తారు. దీనికోసం పలు కౌంటర్లను ఏర్పాటు చేస్తామని డీసీ చెప్పారు. కార్యక్రమం ప్రారంభోత్సవం తరువాత ప్రతి నెలా అన్ని శనివారాల్లో ప్రజాసేవ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

కొప్పళ ఎస్పీగా సాహిల్ బాగ్లా

సాహిల్ బాగ్లా

గంగావతి,న్యూస్‌టుడే: కొప్పళ ఎస్పీగా ప్రభుత్వం సాహిల్ బాగ్లాను నియమించింది. బెంగుళూరు తూర్పు డివిజన్ సంచార నియంత్రణ ఉప కమిషనర్‌గా సేవలు అందిస్తున్న ఆయనను ఇక్కడకు బదిలీ చేసింది. ప్రస్తుత ఎస్పీ రామ్ అరసిద్ధి స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. బీటెక్ చదివిన సాహిల్ బాగ్లా 2018లో యూపీఎస్సీ ఉత్తీర్ణులై కర్ణాటక కేడర్ అధికారిగా నియమితులయ్యారు.

నిర్లక్ష్యదోరణిని ఖండిస్తూ నిరవధిక దీక్ష

నినాదాలు చేస్తున్న దళిత సంఘాల కార్యకర్తలు

సిరివార(మాన్వి), న్యూస్‌టుడే: అశ్విని హత్య, రాణమ్మల హత్యలను నిరసిస్తూ హొక్రాణి గ్రామంలో వివిధ దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దళితుల హత్యలను ప్రభుత్వం నిర్లక్ష్యదోరణితో చూస్తుందని ఆరోపించారు. రాష్ట్రముఖ్యమంత్రిని కలిసి విన్నవించినా దర్యాప్తులో పురోగతి లేదని నిందించారు. బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇదే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కె.నాగలింగస్వామి, ప్రభురాజ్ కొడ్లి, తిప్పణ్ణబాగలవాడ, అబ్రాహాం, హనుమంత సీకల్, కాశీనాథ్ కురిడి, రవికుమార్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బళ్లారి, న్యూస్‌టుడే: సిరుగుప్ప తాలూకా తెక్కెలకోటె పట్టణ దేవినగర బాగేవాడి సమీపంలోని కాలువలో ఓ గుర్తుతెలియని గుర్తుతెలియని వ్యక్తి(50) మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 5.2 అడుగుల ఎత్తు, సాధారణ శరీరాకృతి, కోల ముఖం, తదితర గుర్తులు ఉన్నాయి. మృతుడి సంబంధికులు ఉంటే తెక్కలకోటె పోలీసులను సంప్రదించాలన్నారు.

విద్యార్థుల్లో నిజాయతీ పెంపొందించాలి

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నైతిక విలువల బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా బాధ్యమంత్రి టి.రఘుమూర్తి పేర్కొన్నారు. శనివారం ఆయన తాలూకాలోని సాణికెర వేదా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆదియోగి శివుని ప్రతిమను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులకు భారత సంస్కృతి, ఆధ్యాత్మికతను బోధిస్తే ఉత్తమ భవిష్యత్తును రూపొందించుకోవడానికి సాధ్యపడుతుందన్నారు. వేదా విద్యాసంస్థల అధ్యక్షుడు రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సాణికెరలో ఆదియోగి శివుని ప్రతిమను ఆవిష్కరించిన మంత్రి రఘుమూర్తి

హొళల్కెరను కరవు ప్రాంతంగా ప్రకటించాలని ఒత్తిడి

చెరువు అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చంద్రప్ప

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: హొళల్కెర తాలూకాలో తీవ్ర వర్షాభావం నెలకొని అనావృష్టి పరిస్థితులు చోటుచేసుకొన్నా రాష్ట్ర ప్రభుత్వం కరవు పీడిత తాలూకాగా ప్రకటించలేదని ఎమ్మెల్యే ఎం.చంద్రప్ప అభ్యంతరం తెలిపారు. శనివారం ఆయన తాలూకాలోని టి.నులేనూరులో రూ.1.90 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన చెరువు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. ఎగువ భద్రా పథకం కింద భద్రా జలాశయం నుంచి ప్రయోగాత్మకంగా చెరువులకు మరో నెల రోజుల్లో నీటిని నింపే పనులు ప్రారంభం అవుతాయన్నారు. అనేక చెరువులు నిండితే భూములు సాగులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సాణేహళ్లి మఠాధిపతి ఆధ్యాత్మిక గురువు డా. పండితారాధ్యస్వామి, లోక్‌సభ మాజీ సభ్యుడు జనార్దన స్వామి, జడ్పీ మాజీ సభ్యుడు షణ్ముఖప్ప పాల్గొన్నారు.

నైతిక విలువలతో వైద్యసేవ

సదస్సును ప్రారంభిస్తున్న మనీషా కొటేకర్, వీరేంద్రహెగ్గడే తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : సంప్రదాయ ఆయుర్వేద విధానంతో పంచేంద్రియాలను నియంత్రిస్తూ.. మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని భారతీయ వైద్య మండలి అధ్యక్షురాలు డాక్టర్ మనీషా కొటేకర్ అభిప్రాయపడ్డారు. ధర్మస్థల ఉజిరేలోని ఆప్తాస్ ఆయుర్వేద ట్రస్టు పదో వార్షికోత్సవం సందర్భంగా శనివారం అమృతవర్షిణి భవన్‌లో ఏర్పాటు చేసిన 'పునర్వసు' పేరిట అంతర్జాతీయ సదస్సును ఆమె ప్రారంభించారు. వైద్యులు నిరంతర అభ్యాసం, అధ్యయనం, పరిశోధనలతో తమ విజ్ఞానాన్ని విస్తరించుకోవాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని మనీషా కొటేకర్ సూచించారు. నైతిక విలువలతో రోగులకు వైద్యసేవలందించాలని పిలుపునిచ్చారు. ధర్మస్థల ధర్మాధికారి డి.వీరేంద్రహెగ్గడే మాట్లాడుతూ ఆయుర్వేదాన్ని దైనందిన జీవితంలో ఉపయోగించడంతో ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. ఉడుపి, హాసన, బెంగళూరులోని ఎస్.డి.ఎం. ఆయుర్వేద ఆసుపత్రులు రాయితీ ధరలకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ఉడుపి ఆయుర్వేద కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ వైద్యుడు ఎం.శరద్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోని ఆరువందల ఆయుర్వేద కళాశాలల ఆధ్వర్యంలో రాబోయే ఐదేళ్లలో ఏటా 500 మంది వాలంటీర్లను తయారుచేసి.. గ్రామాల్లో ఈ వైద్యంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వీరేంద్రహెగ్గడేను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుష్‌శాఖ కమిషనర్ సునీల్‌పన్వార్, సీఈవో శ్రద్ధాఅమిత్, ప్రముఖులు ప్రసన్న ఎన్.రావు, అనుపమ వి.చిన్నికట్టి తదితరులు పాల్గొన్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్రీ లాంచింగ్ ప్రొడక్ట్ బేసిడ్ ఇన్వెస్ట్‌మెంట్, బైనారి బిజినెస్ కాన్సెప్ట్ స్త్రీ/పు. నిరుద్యోగులు, MLM, మార్కెటింగ్ లీడర్స్ లక్షల్లో వీక్లీటీమ్ సంపాదన. ✆ 7013203996.

FINANCIAL SERVICES

లేక్‌ల్యాండ్ కంపెనీ - అన్నిలోన్లు ప్రాపర్టీ, LAP, బిజినెస్, వ్యవసాయ, టేకోవర్ పర్సనల్, గ్రూప్ లోన్లు @ 7% వడ్డీ. ఏజెంట్లు కావలెను. మంచి కమీషన్. 8961920779

REAL ESTATE

LAND FOR SALE

Tamilnadu Arunachala (Tiruvannamalai) 5.87 Acres Sale. Suitable for Ashrams, Institution, Farm Houses. ✆ 9840651404.

JOBS

ఆర్వి డిజిటల్స్ - తిరుపతి నందు పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్ (ఫోటోషాప్, కోరల్ డ్రా తెలిసినవారు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 86380 56789.

Exp. **ఆయాలు** / వార్డ్ బాయ్స్ నర్సులు కావలెను. జీతం: 21000/-నుండి 30,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. Ph: 8096770770/ 9985601234.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

సొంతింటికే కన్నమేసి..కటకటాల వెనక్కి..

పరశురామ

బళ్లారి, న్యూస్‌టుడే: తన ఇంట్లోనే దొంగతనం చేసి చివరికి జైలు ఊచలు లెక్కపెట్టిన ఘటన సిరుగుప్ప తాలూకాలో జరిగినట్లు ఎస్పీ డా.డి.సుమన్ పెన్నేకర్ తెలిపారు. తాలూకా ఇబ్రహీంపుర గ్రామానికి చెందిన పరశురామ (22) అనే వ్యక్తి ఆటో చోదకుడిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు తిరుపతికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన పరుశురామ బీరువాను పగలగొట్టి రూ.1.87లక్షల నగదు దోచుకున్నాడు. అనంతరం ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, పరశురామపై అనుమానంతో విచారించగా, తానే తస్కరించి ఫిర్యాదు చేసినట్లు గుర్తించి కేసు నమోదు చేసుకుని జైలుకు తరలించారు.

చోరీ యత్నం విఫలం

కంప్లి, న్యూస్‌టుడే: బ్యాంకులో డబ్బు డ్రా చేసి ఇంటికి వెళ్తున్న తండ్రీ కొడుకులపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటన కంప్లి మారుతీనగర్‌లో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు శనివారం తెలిపిన వివరాల మేరకు.. కేఎస్ఆర్టీసీ బస్ డ్రైవర్‌గా పని చేసిన హుసేన్ సాబ్ ఇటీవల పదవీ విరమణ పొందారు. పీఎఫ్ డబ్బులు డ్రా చేసేందుకు ఆయన తన కుమారుడు యూసుఫ్‌తో కలిసి స్కూటీపై కంప్లిలోని కెనరా బ్యాంకుకు వెళ్లారు. రూ.3.97 లక్షలు బ్యాంకు నుంచి డ్రా చేసి మారుతీనగర్‌లోని తమ ఇంటి వద్దకు వచ్చారు. స్కూటీ డిక్కీలో నుంచి డబ్బు తీసుకుంటుండగా ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి దాడి చేశారు. ఓ వ్యక్తి హుసేన్ సాబ్ చేతిలోని డబ్బును లాక్కొనే ప్రయత్నం చేస్తుండగా మరో వ్యక్తి రాడ్‌తో దాడి చేశాడు. వెంటనే తండ్రీ కుమారులు ఇద్దరు భయంతో దొంగలు..దొంగలు అని గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పరుగెత్తుకు రావడం చూసి ఆ ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనం వదిలి పరారయ్యారు. కంప్లి పోలీసు ఠాణాలో కేసు నమోదైంది.

అగ్నిప్రమాదంలో గుడిసెలు దగ్ధం

అగ్నిప్రమాదంలో కాలిపోయిన గుడిసెలు

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా హడగలిలో జరిగిన అగ్నిప్రమాదంలో రెండు గుడిసెలు కాలి బూడిదయ్యాయి. ఆ ప్రాంతానికి చెందిన ప్రకాశ్, విశాలాక్షి అనే దంపతులు పూరి గుడిసెలో దేవుని ముందు దీపం వెలిగించి కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం వీచిన ఈదురు గాలులతో దీపం నుంచి వ్యాపించిన మంటలు గుడిసెకు అంటుకున్నాయి. పక్కనే ఉన్న బసీర్‌సాబ్ అనే వ్యక్తి గుడిసె కూడా కాలిపోయింది. రెండు గుడిసెల్లోని వస్తువులు, దుస్తులు, ధాన్యాలన్నీ కాలిపోవడంతో ఆ కుటుంబాలు వీధిన పడ్డాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు మరింత వ్యాపించకుండా నియంత్రించాయి. దీనిపై హడగలి పోలీస్ ఠాణాలో కేసు నమోదైంది.

తమిళనాడు వాసి కాలువలో గల్లంతు

హొసపేటె, న్యూస్‌టుడే: బిందెలో నీరు నింపుకొంటూ ఆకస్మికంగా కాలుజారి మురళీధర (33) అనే వ్యక్తి కమలాపుర సమీపం పవర్ కెనాల్(ఎల్లెల్సీ)లో గల్లంతైన ఘటన శనివారం జరిగింది. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ఓ కుటుంబం కర్ణాటక రాష్ట్రం విజయనగర జిల్లాలోని హంపీ వీక్షణకు వచ్చింది. ఎల్లెల్సీ వద్ద భోజనానికి వాహనం ఆపగా, బిందెలో నీరు నింపుకోవటానికి కాలువ వద్దకు వెళ్లిన మురళీధర జారిపడి గల్లంతయ్యాడు. విషయం తెలిసిన వెంటనే హంపీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. కేసు దర్యాప్తులో ఉంది.

పవర్ కెనాల్ వద్ద పరిశీలిస్తున్న హంపీ పోలీసులు

వాయుపుత్రునికి ప్రత్యేక పూజలు

తాళ్యలోని ఆంజనేయ స్వామి ఆలయంలో విశేష అలంకరణ

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా ఆంజనేయుని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వందల మంది హనుమంతుని భక్తులు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వివిధ దేవాలయాల్లో వాయుపుత్రునికి భక్తులను ఆకట్టుకొను విధంగా అలంకరించి, తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు. పట్టణములోని రామ మందిరం, తాళ్య, పాత ఊరు తదితర చోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మండకళ్లి రైతుల తిరుగుబాటు

మైసూరు : వరుణ నియోజకవర్గం పరిధి మండకళ్లి విమానాశ్రయ సమీపాన 165 ఎకరాల వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకునేందుకు కర్ణాటక పరిశ్రమల అభివృద్ధి మండలి చర్యలు చేపట్టింది. బిడది వద్ద టౌన్‌షిప్‌నకు భూములు ఇచ్చేది లేదని రైతులు ఆందోళన చేస్తున్న సమయంలోనే ఈ ప్రాంతంలో భూములపై మండలి కన్నేసింది. తాము వక్క, అరటి, కొబ్బరి, వరి సాగు చేస్తున్నామని, పొలాలను ఇవ్వబోమని రైతులు స్పష్టం చేశారు. ఆ రైతులకు రైతు సంఘాలు, స్థానిక నివాసుల సంఘాలు మద్దతు పలికాయి.

పల్లెలు కనుమరుగు కాకూడదు

రైతుల్లా మెళ్లో ఆకుపచ్చ తువాళ్లతో ప్రారంభోత్సవ వేడుకలో విద్యార్థులు, అధ్యాపకులు

సింధనూరు, న్యూస్‌టుడే: మన పల్లెలు సంస్కృతికి నిలయాలని విశ్రాంత ఉపాధ్యాయుడు, తాలూకా కన్నడసాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు వెంకనగౌడ వటగల్ పేర్కొన్నారు. సింధనూరు నేషనల్ కళాశాల బీఏ అంతిమ విద్యార్థులు శనివారం కళాశాలలో నిర్వహించిన 'హళ్లి హంగామా' (పల్లె సందడి) కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మనిషి జీవనశైలి పల్లెతోనే ఆరంభమవుతుంది.. మనం తినే ఆహారం చాలా వరకు పల్లెల నుంచే వస్తుంది.. అలాంటి పల్లెటూర్లను కాపాడుకోవాలి, సంప్రదాయ విలువలు పెంచాలి, రైతు కష్టం గుర్తించాలని వెంకటన గౌడ అన్నారు. హంగామా సందర్భంగా విద్యార్థులు కళాశాలను పల్లెటూరుగా మార్చేశారు. తమ ఇళ్లలో ఉన్న కవ్వం, రుబ్బురోలు, పొయ్యిలు, కొడవళ్లు వంటి పురాతన వస్తువులు, పరికరాలను తీసుకొచ్చి తరగతి గదులను ఆధునిక పల్లెటూరుగా మార్చేయడం చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని తహసీల్దారు అరుణ్‌దేశాయ్ ఎడ్లబండి నడుపుతూ ప్రారంభించారు. విద్యార్థులంతా మెళ్లో ఆకుపచ్చ తువాళ్లతో రైతుల్లాగా మారారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సరస్వతి పాటిల్, ఆర్.సి.పాటిల్, చుటుకు సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు భీరప్ప శంభోజి, నేషనల్ కళాశాల పాలకమండలి అధ్యక్షుడు అశోక్ బెన్నూరు, చంద్రశేఖర్ బెన్నూరు తదితరులు పాల్గొన్నారు.

చేసిన మంచి పనులే గుర్తుంటాయ్

వేదికపై రామకృష్ణ ఆశ్రమం స్వామీ సదానంద మహారాజ్ తదితరులు

గాంధీనగర్ (సింధనూరు), న్యూస్‌టుడే: ఏ మనిషీ శాశ్వతంగా భూమి మీద ఉండిపోరు..అయితే బతికిన కొద్ది కాలంలో జనం కోసం చేసిన మంచి పనులు మాత్రం శాశ్వతంగా నిలుస్తాయి..జనం గుండెల్లో పదిలంగా జ్ఞాపకాల దొంతర్లుగా ఉండిపోతాయని సింధనూరు రామకృష్ణ వివేకానంద ఆశ్రమ ముఖ్యుడు స్వామీ సదానంద మహారాజ్ విద్యార్థులకు హితవు పలికారు. తాలూకా తెలుగు ప్రముఖులు, గాంధీనగర్ పంచాయతన క్షేత్రం స్థాపకుడు, దివంగత మద్దిపాటి గంగాధరరావు తొమ్మిదో వర్ధంతి సందర్భంగా గాంధీనగర్‌లో వారి కుటుంబ సభ్యులు శనివారం పలు కార్యక్రమాలు జరిపారు. మద్దిపాటి గంగాధరరావు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల ప్రతిభా పురస్కారం, ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన స్వామి మాట్లాడారు. కాలిఫోర్నియా నుంచి వచ్చిన మానసిక ఆరోగ్య యువ శాస్త్రవేత్త డాక్టర్ ముళ్లపూడి త్రినాథ్ మాట్లాడుతూ హైస్కూలు, కళాశాల విద్యార్థులు ఒత్తిడి తగ్గించుకోవాలని సలహా ఇచ్చారు. యువత ఆత్మహత్యల అంశంపై తాను చేస్తున్న పరిశోధనపై విద్యార్థులకు వివరించారు. బలవన్మరణాలకు పాల్పడకుండా వారికి సలహాలు ఇచ్చారు. క్యాంపు పరిసరాల్లో ప్రతిభావంత ఏడుగురు విద్యార్థులకు తలా రూ.25 వేల నగదు పురస్కారాన్ని గంగాధరరావు కుమార్తె, అల్లుడు చంద్రకళ, ముళ్లపూడి భాస్కరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంపుపెద్దలు హరిశ్చంద్రరావు, జి.వీర్రాజు, ఆర్.సి.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ ఊతంతో నాజూకు మార్గాలు!

ఓఆర్ఆర్‌కు కొత్త రూపురేఖలు

వైట్‌ఫీల్డ్ రహదారి ఇలా తీర్చదిద్దాలని ప్రతిపాదన

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: వాహన సంచార రద్దీ నియంత్రణ చర్యలకు ఐటీ సంస్థల సహకారం తోడైంది. బెంగళూరును పీడిస్తున్న ఈ సమస్య కట్టడి ప్రణాళికల్లోకి తొంగిచూస్తే.. దేశంలోనే అత్యంత సంచార రద్దీ ప్రదేశం బెంగళూరు అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్). ఈ మార్గంలో వాహన రాకపోకల రద్దీ నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం, అవుటర్ రింగ్ రోడ్డు కంపెనీ యాజమాన్యాలు ఒకే తాటిపైకి వచ్చాయి. అందుకోసం కార్యాచరణ పథకాన్ని సిద్ధం చేశారు. 60 కిలోమీటర్ల పొడవు కలిగిన ఈ ఓఆర్ఆర్‌లో ప్రపంచంలో ఖ్యాతి పొందిన 500 పైగా ఐటీ, బీటీ కంపెనీలు ఉన్నాయి. వాటిల్లో 7 లక్షల మందికిపైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. ఉద్యోగులు సొంత వాహనాలు లేకపోతే సంస్థ వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. అవుటర్ రింగ్ రోడ్డులో గంటకు 50 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు సంచార పోలీసులు అంచనా వేశారు. కె.ఆర్.పురం నుంచి సిల్క్‌బోర్డు కూడలి, అగర నుంచి సర్జాపుర వరకు ఐటీ కంపెనీలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఆమార్గాల్లో సంచార రద్దీ ఎక్కువ. హెబ్బాళ రింగ్ రోడ్డు కూడలిని గంటలకు 20 వేలు వాహనాలు దాటుతున్నట్లు గుర్తించారు. ఓవైపు మెట్రో పనులు సాగుతుండటంతో రద్దీ తీవ్రమైంది. కిలోమీటర్లు సంచరించేందుకు 10 నిమిషాల సమయం పడుతుందని ఇప్పటికే పలు సంస్థలు వెల్లడించిన విషయం విదితమే. దీంతో రద్దీగా ఉండే ప్రదేశాలు సర్జాపుర, బెళ్లందూరు, మారతహళ్లి, దొడ్డబేగూరు తదితర ప్రాంతాల్లో ప్రతి 5 కిలోమీటర్లను ఆయా కంపెనీలు దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చినట్లు బీబీఎంపీ అధికారులు తెలిపారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో సంచార రద్దీ అదుపులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

హనుమయ్యా.. మమ్మేలవయ్యా

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: శ్రావణమాసం మూడో శనివారాన్ని పురస్కరించుకుని వెంకటేశ్వరనగర్ అభయ వరదాంజనేయస్వామి ఆలయంలో స్వామికి విశేష అభిషేకాలు, పూజలు చేపట్టారు. సామూహిక హనుమాన్ చాలీసా పఠనం, తదితర కైంకర్యాలు నిర్వహించారు. తమలపాకులు, పుష్పాలతో అలంకరించారు. బాలాంజనేయ మఠంలో హనుమయ్యకు వడలతో అలంకరించి పూజించారు. మిల్లరుపేట ఆంజనేయుడు, మార్కాండేయ కాలనీ పంచముఖి ఆంజనేయుడు, నాగుల చెర్వు అంజన్న, రెడ్డివీధి ఆంజనేయస్వామిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పాలడుగు ధనంజయ, కమిటీ సభ్యులు, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరనగర్ అభయ వరదాంజనేయుడికి తమలపాకులతో అలంకరణ

బాలాంజనేయస్వామి మఠంలో హనుమంతుడికి వడలతో అలంకరణ

పల్లకి ఉత్సవంలో పాల్గొన్న హనుమభక్తులు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పల్లకి ఉత్సవం

మాన్వి, న్యూస్‌టుడే: బల్లటగి అంచేటి ఆంజినేయ స్వామివారి దేవస్థానానికి నూతన హనుమాన్ వెండి విగ్రహం, పల్లకి సమకూరాయి. ఆలయంలో విశేష పూజలు నిర్వహించి, స్వామివారి కొత్త వెండి విగ్రహాన్ని నూతన పల్లకిలో పెట్టి ఊరేగించారు. దేవస్థానం ప్రాంగణంలో హోమ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రముఖులు అరుణ్‌కుమార్ నాయక్, వెంకటేశ్ సిరివార, రంగారెడ్డినాయక్, గోవిందప్ప పాల్గొన్నారు.

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

సంతోషిమాతకు వార్షిక రాఖీ ఉత్సవం

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: హొసపేటె రోడ్డులోని సంతోషి మాత ఆలయంలో అమ్మవారికి శనివారం 55వ వార్షిక రాఖీ ఉత్సవం పురస్కరించుకుని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. ఉయ్యాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజలను తిలకించారు. భక్తులందరికీ అన్నసంతర్పణ చేశారు. ఆలయ గురువు రాజుస్వామి రాఖీ ఉత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు.

కంటోన్మెంట్ సంతోషిమాతకు విశేష అలంకరణ

నిరవధిక సత్యాగ్రహం కొనసాగింపు

బళ్లారి, న్యూస్‌టుడే: కుడతిని భూపోరాట సమితి, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సత్యాగ్రహం శనివారానికి 1,346వ రోజుకు చేరుకుంది. రైతులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఆందోళనలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు గట్టిగా హెచ్చరించారు.

సత్యాగ్రహ శిబిరంలో పాల్గొన్న రైతులు

నలుగురు బాల కార్మికులకు విముక్తి

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు తాలూకా కురేకుప్ప పట్టణంలో వివిధ పరిశ్రమలపై శనివారం సంయుక్త కార్యదళ కమిటీ ఆకస్మికంగా దాడులు చేసి నలుగురు బాలకార్మికులకు విముక్తి కల్పించాయి. జిల్లా న్యాయసేవల అథారిటీ, జిల్లా బాల కార్మిక యోజన, కార్మిక, రెవెన్యూ, విద్య, పోలీస్ శాఖ, బాలల రక్షణ విభాగం సంయుక్తంగా కురేకుప్ప వ్యాప్తిలోని 25 పరిశ్రమలను ఆకస్మికంగా తనిఖీ చేశాయి. అక్కడ పనిచేస్తున్న వారిలో నలుగురు బాలకార్మికులను రక్షించారు. అక్కడి వారి నుంచి వివరాలు సేకరించి గతంలో చదువుతున్న పాఠశాలల్లోనే అధికారులు తిరిగి చేర్పించారు. పిల్లలను అక్రమంగా పనిలో పెట్టుకున్న దుకాణాలు, పరిశ్రమల యజమానులపై బాల కార్మిక చట్టం కింద కేసు నమోదు చేశారు. భవిష్యత్తులో బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం లేదని కరపత్రాలను అందజేసి అవగాహన కల్పించారు. దాడిలో ఉప తహసీల్దార్ సుబ్బారావు, సిబ్బంది మంజునాథ్, చేతన, గోవిందప్ప, హర్ష, రవికుమార్ పాల్గొన్నారు.

పాదచారి మార్గం.. ఆక్రమణలదే రాజ్యం

బెంగళూరు రహదారిలోని పాదచారి మార్గంపై ఆక్రమణలను తొలగిస్తున్న పాలికె సిబ్బంది

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరంలోని బెంగళూరు రహదారికి ఇరువైపులా పాదచారి మార్గాలను ఎక్కడికక్కడ ఆక్రమించి కట్టడాలు కట్టేశారు. పాదచారులు రహదారిపై వెళ్లలేక నిత్యం ట్రాఫిక్ అంతరాయంలో చిక్కుకుంటున్నారు. ఈ విషయంపై ఫిర్యాదులు రావడంతో నగర పాలికె అధికారులు ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. శనివారం స్థానిక బ్రూస్‌పేటె కూడలి నుంచి ఏపీఎంసీ మార్కెట్ వరకు పాదచారి మార్గాలపై వెలసిన అక్రమ కట్టడాలు

తొలగించిన పాలికె అధికారులు, సిబ్బంది

తొలగించారు. రెండు పొక్లెన్ల సాయంతో పాదచారి మార్గాలపై ఉంచిన వస్తువులు, పెట్టెలను పాలికె సిబ్బంది ట్రాక్టర్‌లో వేసుకెళ్లారు. అక్రమ నిర్మాణాలను

స్వచ్ఛందంగా కట్టడాలను తొలగించుకుంటున్న దుకాణాల యజమానులు

నిర్మించిన కట్టడాలను తొలగిస్తున్న యంత్రం

పొక్లెన్లతో తొలగించారు. కొంత మంది స్వచ్ఛందంగా వస్తువులను తొలగించుకున్నారు. ముందు జాగ్రత్తగా దుకాణాల యజమానులు తీసుకుంటూ పాలికె అధికారులకు సహకరిస్తున్నారు. పాదచారి మార్గాలపై వెలసిన కట్టడాలను తొలగించడంతో రాకపోకలకు వీలు ఏర్పడిందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బళ్లారి, న్యూస్‌టుడే: జెస్కాం బళ్లారి నగర ఉపవిభాగం-2 వ్యాప్తిలోని జిల్లా కోర్టు సంకీర్ణ భవనంలో విద్యుత్తు మరమ్మతులు జరుగుతుండటంతో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురవుతుందని జెస్కాం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిధిలోని తాళూరు రహదారి, స్నేహకాలనీ, శ్రీనగర, రేణుకనగర, భగత్‌సింగ్ నగర, కన్నడ నగర, మహానంది కొట్టం, పార్వతినగర, తదితర చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

31న గ్రామీణ వ్యాప్తిలో

బళ్లారి: బళ్లారి గ్రామీణ జెస్కాం వ్యాప్తిలోని 110/11కేవీ విద్యుత్తు కేంద్రంలో మరమ్మతులు జరుగుతుండటంతో ఈ నెల 31న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురవుతుందని జెస్కాం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రం పరిధిలోని మోకా, బి.డిహళ్లి, మసీదిపుర, గొటూరు, వణేనూరు, బణాపురం, గడుదూరు, అశోక్‌నగర క్యాంపు, కప్పగల్లు, సిరివార, సంగనకల్లు, చాగనూరు, బసరకోడు, శివపుర, హిరేహడ్లిగి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

ఖోఖోలో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖోఖోలో విద్యార్థుల సత్తా

బళ్లారి, న్యూస్‌టుడే: కురుగోడు తాలూకా విభాగ స్థాయి క్రీడాపోటీల్లో హరగినడోణి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఖోఖో బాలికల విభాగంలో మౌలానా అజాద్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల - హరగినడోణి ప్రభుత్వ పాఠశాల జట్లు పోటీ పడ్డాయి. ఈ పోటీల్లో హరగినడోణి ప్రభుత్వ పాఠశాల జట్టు 6 పాయింట్లతో గెలుపొంది, తాలూకా స్థాయి పోటీలకు ఎంపికైంది. బాలుర విభాగంలో హరగినడోణి ప్రభుత్వ పాఠశాల జట్టు - జవహర్ ప్రభుత్వ పాఠశాల జట్టు తలపడ్డాయి. హరగినడోణి ప్రభుత్వ పాఠశాల జట్టు రెండు పాయింట్లు తేడా గెలుపొంది, తాలూకా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గెలుపొందిన ఎస్.టి.ఎం.సి. అధ్యక్షురాలు దొడ్డనగౌడ, జీపీ సభ్యుడు చంద్రు, ముఖ్య ఉపాధ్యాయురాలు జీవ, ఉపాధ్యాయులు వనజాక్షమ్మ, గ్రేసి, మల్లికార్జున, లోకేశ్, మాధురి, అతిథి ఉపాధ్యాయులు అశోక్, మాయాదేవి, జ్యోతి అభినందించారు.

ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోండి

పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న టీపీ అధికారిణి లక్ష్మిదేవి యాదవ్

కారటగి, న్యూస్‌టుడే: 18 ఏళ్లు నిండిన విద్యార్థులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని కారటగి తాలూకా పంచాయతీ అధికారిణి లక్ష్మిదేవి యాదవ్ విద్యార్థులకు సూచించారు. కారటగి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఓటరు జాబితా విశేష పరిష్కరణ -26 (సర్) కార్యక్రమంలో భాగంగా శనివారం నూతన ఓటరు నమోదు ప్రక్రియలో ఆమె మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకు అత్యంత ప్రాధాన్యం ఉంది. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు సరైన దాఖలాలతో నమూనా-6 ఫారం భర్తీ చేసి ఓటు హక్కు పొంది వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన విద్యార్థులు నమూనా-6 ఫారం తీసుకున్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ప్రకాష్ హిరేమఠ, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న విషాహారం

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు ప్రభుత్వ వసతి నిలయాల్లో విద్యార్థులను విషాహారం సమస్య వదలడం లేదు. నెల తిరగకుండా మూడోసారి ఈ ఘటన చోటుచేసుకుంది. శనివారం ఉదయం అల్పాహారంగా తీసుకున్న చిత్రాన్నం కారణంగా స్థానిక టౌన్ పోలీసు స్టేషను ఎదురుగా ఉన్న అంబేడ్కర్ హాస్టలు హైస్కూలు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. తింటున్న ఆహారంలో ఇనుప ముక్కలు, ఇతర వ్యర్థాలు కనిపించాయి. కొద్దిసేపట్లోనే వాళ్లకు వాంతులు కావడంతో దశల వారీగా మొత్తం 30 మంది విద్యార్థులను పీడబ్ల్యూడీ క్యాంపులోని ఎంసీహెచ్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఎవరికీ ప్రమాదం లేదని, సాయంత్రానికి కోలుకుంటారని ఆసుపత్రి ముఖ్య వైద్యురాలు కావేరి వెల్లడించారు. విషయం తెలుసుకుని ఎమ్మెల్యే బాదర్లి, ఎమ్మెల్సీ బసనగౌడ, భాజపా నాయకుడు కె.కరియప్ప, మాజీ మంత్రి నాడగౌడ ఆసుపత్రికి వేంచేసి విద్యార్థినుల యోగక్షేమాలను వాకబు చేశారు. ఎమ్మెల్యే అక్కడే విలేకరులతో మాట్లాడుతూ వసతి నిలయాల్లో తరచూ ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసుకుని తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

తల్లీపిల్లల ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న విద్యార్థినులను పలకరిస్తున్న ఎమ్మెల్యే బాదర్లి

నేడు పరీక్షా కేంద్రాల చుట్టూ నిషేధాజ్ఞలు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర శివారు ప్రాంతంలో ఉన్న బీఐటీఎం కళాశాలలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాష్ట్రీయ అర్హత ప్రవేశ పరీక్ష-2026 జరగనుంది. పరీక్షలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కళాశాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు జిల్లా పాలనాధికారి కె.నాగేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా కేంద్రం చుట్టూ అనధికార వ్యక్తులు, గుంపులుగా చేరడం నిషేధించినట్లు చెప్పారు.

సిద్ధాపురలో ఆటల పోటీలు ప్రారంభం

క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న పీడీవో జ్యోతి రెడ్డేర్

కారటగి, న్యూస్‌టుడే: తాలూకాలోని సిద్ధాపురలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల క్రీడలు శనివారం ప్రారంభమయ్యాయి. గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారిణి జ్యోతి రెడ్డేర్ క్రీడా జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పోటీతత్వం అలవర్చుకోవాలి. క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి. మొబైల్, ఆన్‌లైన్ గేమ్స్ తదితర వ్యసనాలకు బానిస అవకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత విద్య అభ్యసించాలని సూచించారు. బరగూరు, ఉళేనూరు, సిద్ధాపుర క్లస్టర్ల పరిధి 14 ఏళ్ల లోపు విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు మంజునాథ విద్యార్థులకు క్రీడా ప్రతిజ్ఞా విధి బోధించారు. ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు హనుమంతప్ప నాయక్, విద్యా శాఖ అధికారి మంజునాథ చిక్కేనకొప్ప, వీరభద్ర గౌడ ఎత్తినమని, శంకరమ్మ సజ్జన్, విఠల్ జీరగాళి పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

29-08-2026 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1630.62	1626.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	9,343	36,726
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8,905	38,894
నీటి నిల్వ (టి.ఎం.సి)	96.419	79.798
గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు)	వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు	

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కురుగోడు(బళ్లారి), న్యూస్‌టుడే: తాలూకా విభాగం క్రీడాపోటీలు శనివారం బాదనహట్టి గ్రామంలోని శ్రీనిధి పాఠశాల క్రీడామైదానంలో జరిగాయి. ఈ పోటీలను సంఘం కార్యదర్శి ప్రభాకర్ అరసు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు చాలా ముఖ్యం.. క్రీడల్లో పాల్గొనడంతో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటూ చదువులోనూ ముందు వరుసలో ఉంటారన్నారు. ప్రాథమిక పాఠశాల నుంచే విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచే విధంగా ఉపాధ్యాయులు వెన్నుతట్టి ప్రోత్సహించాలన్నారు. ఎస్ఐ సుప్రీత్ విరుపాక్షి మాట్లాడుతూ నేడు యువతీ, యువకులు శారీరక వ్యాయామం తగ్గిపోయింది. చరవాణి, అంతర్జాలం, వీడియో గేమ్స్ వంటి వాటిపై ఆసక్తి పెంచుకుంటున్నారు. విద్యార్థులు ఇలాంటి వాటికి దూరంగా ఉంటూ మైదానంలో జరిగే ఆటలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. సంఘం అధ్యక్షుడు తాండవకృష్ణ అధ్యక్షత వహించారు. తాలూకాలో 22 పాఠశాలల నుంచి 600మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడా సంఘం కార్యదర్శి సిద్ధప్ప, ఉపాధ్యాయులు పంచాక్షరి స్వామి, రవిరెడ్డి, శంకర్, విరూపాక్షి, తేజప్ప, రుద్రప్ప, జడేశ్ స్వామి, భీమరెడ్డి, బసవరాజ్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ సుప్రీత్ విరుపాక్షి, ప్రభాకర్ తదితరులు

ఖోఖోలో పోటీ పడుతున్న విద్యార్థులు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బళ్లారి: బళ్లారి గ్రామీణ పోలీస్‌స్టేషన్ వ్యాప్తిలోని లక్ష్మీనగర్ క్యాంపు వద్ద సిరుగుప్ప రహదారి-150 రాష్ట్ర రహదారిలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి(60) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామీణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి బీఎంసీఆర్‌సీకి తరలించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. మృతుడి సంబంధికులు ఉంటే గ్రామీణ పోలీసులను సంప్రదించాలన్నారు.

అనుమానాదస్పద స్థితిలో యువకుడి మృతి

మాన్వి,న్యూస్‌టుడే: కవితాళ సమీపంలోని హుసేన్‌పుర చేలో రామణ్ణ (25) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మాన్వి సీఐ సోమశేఖర్ వివరాల ప్రకారం.. తాలూకాలోని నక్కుంది గ్రామానికి చెందిన రామణ్ణ బెంగళూరులో వాహన చోదకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. 4 రోజుల క్రితమే బెంగళూరు నుంచి వచ్చినా గ్రామానికి వెళ్లలేదు. శనివారం మధ్యాహ్నం హుసేన్‌పురా సమీపంలోని ఓ పొలంలో శవంగా కనిపించాడు. రైతు అయ్యప్ప చేలో మృతదేహం ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు.

నేటితో గృహలక్ష్మికి మూడేళ్లు పూర్తి

హొసపేటె, న్యూస్‌టుడే: మహిళల బ్యాంక్ ఖాతాలకు రూ.2 వేలు నగదు జమ చేసే ప్రభుత్వ గ్యారంటీ పథకాల్లో ఒకటైన గృహలక్ష్మికి మూడేళ్లు నిండిన నేపథ్యంలో సమాచార, పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రముఖ ప్రాంతాలు, స్మారకాలను నేడు పింక్ లైటింగ్‌తో అలంకరిస్తున్నామని ఆ శాఖ హొసపేటె సహాయక సంచాలకుడు బి.ధనంజయప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకూ రాష్ట్రంలో చిత్రదుర్గ కోట, మైసూరు రాజప్రసాదం, హంపీ ఏకశిలా రథం, ఉడుపి జిల్లా కాపులోని లైట్‌హౌస్, బెళగావిలోని కిత్తూరు రాణి చెన్నమ్మ కూడలి సహా పలు ప్రాంతాలను పింక్ లైట్లతో అలంకరిస్తారు. ఈ కార్యక్రమంలో పథకం లబ్ధిదారులు స్వచ్ఛందంగా పాల్గొనవచ్చని అధికారి పేర్కొన్నారు.

బి.ధనంజయప్ప, సహాయక సంచాలకుడు

బళ్లారి గ్రామీణ: తేరువీధి రాఘవరాయుడికి పుష్పాలంకరణ

సత్యనారాయణ పేట రాఘవేంద్రస్వామికి ముస్తాబు

రాయల్‌కాలనీ సంజీవరాయ రాఘవుడికి విశేష పూజలు

వ్యాసరాజమఠం పంచబృందావనాలకు అలంకరణ

చెళ్లకెర: గురు రాఘవేంద్ర స్వామి బృందావనానికి..

కనుల పండువగా రాఘవేంద్రుల పూర్వారాధన

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: మంత్రాలయం రామవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం పూర్వారాధన కార్యక్రమం వైభవంగా జరిపారు. సత్యనారాయణ పేట రాఘవేంద్రుల మఠంలో బృందావనానికి పంచామృతాలతో అభిషేకించారు. పుష్పాలతో అలంకరించారు. పండితులు, స్వామీజీ ప్రసంగించారు. రేడియోపార్కు వ్యాసరాజమఠంలో పంచబృందావనాలు, రాయల్‌కాలనీ సంజీవరాయ, శ్రీనివాస రాఘవేంద్ర స్వామికి, తేరువీధి రాఘవరాయుడికి విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కనకమహాపూజలు అత్యంత ఘనంగా చేపట్టారు. అన్ని మఠాల్లో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మఠం వ్యవస్థాపకుడు ప్రసన్నాచార్, ప్రతినిధులు సురేష్, రాఘవేంద్ర, పాండురంగ ఆచార్, అనంతాచార్, రాఘవ, హరి, నేమకల్లురావు పాల్గొన్నారు.

కారటగి: కారటగి నంజనగూడు గురు రాఘవేంద్ర స్వామి మఠంలో ఆరాధన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు శనివారం ఉదయం భక్తిశ్రద్ధలతో పూర్వారాధన నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిపారు. శుక్రవారం సాయంత్రం గోపూజ, లక్ష్మీపూజ, ధ్వజారోహణ జరిగాయి. మఠం నిర్వాహకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కనకమహాపూజలో పాల్గొన్న భక్తులు

కంప్లి: రాఘవేంద్ర స్వామి మఠంలో: కంప్లి నంజనగూడు రాఘవేంద్ర స్వామి మఠంలో ఆరాధనోత్సవాల సందర్భంగా తొలిరోజు శనివారం పూర్వారాధన జరిగింది. అభిషేకం అనంతరం రాయల బృందావనాన్ని పూలు, పండ్లతో అలంకరించారు. సాయంత్రం మఠం ఆవణలో రథోత్సవం, ఊయల సేవ, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. సత్యనారాయణ మహిళా భజన మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు. తాలూకాలోని రామసాగర గ్రామంలోనూ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

మాన్వి: పట్టణంలోని మంత్రాలయం గురురామవేంద్రస్వామివారి మఠంలో గురుసార్వభౌమ రామవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం స్వామివారికి పూర్వారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుప్రభాత సేవ, అష్టోత్తర పారాయణం, ఫలపంచామృతాభిషేక పూజా కార్యక్రమాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. రామవేంద్రస్వామి బృందావనాన్ని వివిధరకాల పుష్పాలతో అలంకరించారు. ప్రాణేశాచార్య రాఘవేంద్ర జీవిత చరిత్రను వివరించారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన బ్రాహ్మణ, ఆర్యవైశ్య సముదాయ ప్రముఖులను మఠం ఆధ్వర్యంలో సత్కరించారు. డాక్టర్లు రోహిణీమాన్వికర్, అజిత్ కులకర్ణి, హరిప్రసాద్, అశ్వినికాంత్, హరీష్‌మూర్తి, ముద్దురంగరావ్ పాల్గొన్నారు.

సిరుగుప్ప: శ్రీ రామవేంద్ర స్వామి ఆరాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారి ఆరాధనోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం నిర్మల్య, పంచామృత అభిషేకం, మహామంగళ హారతి, భజన మండలి వారితో సంకీర్తనలు, భజనలు చేశారు. స్వామి వారికి, మూల బృందావనానికి తులసిదండలు, పూలదండలతో ప్రత్యేక అలంకరణ చేశారు. పట్టణం, గ్రామాల భక్తులు తరలివచ్చి ఆరాధన ఉత్సవంలో పాల్గొన్నారు.

సిరుగుప్ప: అలంకరణలో మూల బృందావనం

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: గురు రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలను పట్టణంలోని రాఘవేంద్ర స్వామి దేవాలయంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం పూర్వారాధనలో భక్తులు పాల్గొన్నారు.

స్వామి వారికి సమర్పించిన నూతన వస్త్రాలు, ఆహార పదార్థాలు

1న రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం ముట్టడి

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు వీరసంగయ్య

హొసపేటె, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జరుగుతున్న 'సర్' ప్రక్రియను వ్యతిరేకిస్తూ సెప్టెంబరు 1న బెంగళూరులోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టామని రైతు సంఘం నాయకుడు జె.ఎం.వీరసంగయ్య వెల్లడించారు. పలు సంఘాల నాయకులతో కలిసి శనివారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్ ప్రక్రియ అశాస్త్రీయంగా అమలులోకి తీసుకొస్తున్నారని ముందు నుంచే వ్యతిరేకిస్తున్నా, అందులోని లోపాలను ఎలుగెత్తి చూపినా, ఎన్నికల సంఘం పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ ప్రక్రియలతో రాష్ట్రంలో సుమారు 43 లక్షల మంది ప్రజలు ఓటు హక్కునుంచి వంచితులవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఓటర్ల వివరాలు సేకరించే, మ్యాపింగ్‌చేసే బీఎల్‌వోలకు శిక్షణ ఇవ్వకుండానే రంగంలో దింపారు. చాలా మంది పేర్లు తప్పిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ ప్రక్రియను మధ్యలోనే నిలిపివేయడం ఉత్తమమని సలహా ఇచ్చారు. ప్రముఖ న్యాయవాది ఎ.కరుణానిధి, సాహితీవేత్త పీర్‌బాషా, ప్రముఖులు సయ్యద్ నాజీముద్దీన్, బణ్ణదమనె సోమశేఖర్ పాల్గొన్నారు.

కల్యాణ కర్ణాటకను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్

లింగసుగూరు(మాన్వి), న్యూస్‌టుడే: కల్యాణ కర్ణాటక ప్రాంతాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూస్తుందని మాజీ మంత్రి కె.శివనగౌడ నాయక్ ఆరోపించారు. సెప్టెంబరు 1న లింగసుగూరు నుంచి బళ్లారి వరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పాదయాత్ర సన్నాహక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నవలి సమాంతర జలాశయం, తింథిణి బ్యారేజీ, ఎమ్స్ ఏర్పాటు అంశాలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. వీటి సాధనకు పార్టీలకు అతీతంగా ఐక్యపోరు అవసరమన్నారు. భాజపా నాయకుడు పి.రాజీవ్ మాట్లాడుతూ.. మంత్రి నాగేంద్ర రాజీనామా చేస్తే సరిపోదన్నారు. వాల్మీకి మండలి నుంచి లూటీ చేసిన 187 కోట్లను ప్రభుత్వ తిరిగి రాబట్టే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామన్నారు. లింగసుగూరు తాలూకా నీటిపారుదల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావటంలేదని ఎమ్మెల్యే మానప్ప వజ్జల్ ఆరోపించారు. ఇందుకు నందవాడిగి ఎత్తిపోతల పథకమే నిదర్శనమన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు వీరనగౌడ పాటిల్, తాలూకా అధ్యక్షుడు నాగభూషణ్, గిరిమల్లప్ప, అయ్యప్ప, నారాయణనాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి శివనగౌడ నాయక్

(c) eenadu

సొంతింటికే కన్నమేసి.. కటకటాల వెనక్కి..

పరశురామ

బళ్లారి, న్యూస్‌టుడే: తన ఇంట్లోనే దొంగతనం చేసి చివరికి జైలు ఊచలు లెక్కపెట్టిన ఘటన సిరుగుప్ప తాలూకాలో జరిగినట్లు ఎస్పీ డా.డి.సుమన్ పెన్నేకర్ తెలిపారు. తాలూకా ఇబ్రహీంపుర గ్రామానికి చెందిన పరశురామ (22) అనే వ్యక్తి ఆటో చోదకుడిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు తిరుపతికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన పరశురామ బీరువాను పగలగొట్టి రూ.1.87లక్షల నగదు దోచుకున్నాడు. అనంతరం ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, పరశురామపై అనుమానంతో విచారణ చేయగా, తానే తస్కరించి ఫిర్యాదు చేసినట్లు గుర్తించి కేసు నమోదు చేసుకుని జైలుకు తరలించారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	105
క్యారెట్-	120
బీరకాయలు-	70
క్యాబేజి-	45
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	50
సొరకాయ-	55
దొండకాయలు-	55
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	125
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	35
టమాటా(సాధారణ)-	25
గుమ్మడి-	30
ఆలుగడ్డ-	30
ఉల్లి(మేలురకం)-	65
ఉల్లి(సాధారణ)-	55
వెల్లుల్లి-	190
సాంబారు ఉల్లి-	225
బీట్‌రూట్-	55
వంకాయలు-	50
బెండకాయలు-	45
ముల్లంగి-	50
నిమ్మకాయ-	255

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	375
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	385
అరటి కాయలు-	45
సపోటా-	45
పైనాపిల్-	55
బొప్పాయి-	45
ఆరంజి-	195
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

నేపాల్ బాధితులకు సహకారం

హెలికాప్టర్ వద్ద డీకే శివకుమార్‌ను సత్కరిస్తున్న మైసూరు నాయకులు

మైసూరు, న్యూస్‌టుడే : నేపాల్‌లో ఆకస్మికంగా వచ్చిన వరదల్లో చిక్కుకున్న కన్నడిగులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. మైసూరు పర్యటనకు శనివారం విచ్చేసిన ఆయనను హెలిప్యాడ్ వద్ద స్థానికులు, నేతలు సత్కరించారు. నేపాల్ నుంచి మొదట దిల్లీకి వస్తున్న కన్నడిగులకు వసతి సదుపాయాలు కల్పిస్తున్నామని, అక్కడి నుంచి వారిని బెంగళూరుకు తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారని ముఖ్యమంత్రి చెప్పారు.

రైతు నిరసన

కరవు పీడిత ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండు చేస్తూ వివిధ సంఘాల రైతు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కలబురగి నగరంలో ఆందోళనకు దిగారు. రహదారులను దిగ్బంధించి నిరసన వ్యక్తం చేశారిలా – న్యూస్‌టుడే, కలబురగి

కన్నడనాట తెలుగుకు కొత్త వెలుగు

రెండో అధికార భాషగా గుర్తించాలని ప్రతిపాదన

గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : కర్ణాటకలో తెలుగును రెండో అధికార భాషగా గుర్తించాలని, తెలుగు సాహిత్య అకాడమీ శాఖ ఏర్పాటు చేయాలని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎ.రాధాకృష్ణరాజు ప్రతిపాదించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శనివారం బెంగళూరులోని శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో తెలుగు విజ్ఞాన సమితి, కర్ణాటక తెలుగు సంఘాల సమాఖ్యల ఆధ్వర్యంలో తెలుగుభాష పరిరక్షణ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాధాకృష్ణరాజు అధ్యక్షోపన్యాసం చేస్తూ.. కోటి మంది తెలుగు ప్రజలున్న మహారాష్ట్రలో తెలుగును రెండో అధికార భాషగా గుర్తించిన విషయాన్ని గుర్తు చేశారు. 20 లక్షల మంది తెలుగువారున్న పశ్చిమ బెంగాల్‌లో నాలుగో అధికార భాషగా కొనసాగిస్తున్నారన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని 1.40 కోట్ల మంది తెలుగువారు నివసిస్తున్న కన్నడనాట రెండో అధికార భాషగా అమలు చేయాలని విన్నవించారు. సమాఖ్య ప్రతినిధులు ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని ప్రకటించారు. రాష్ట్రానికి చెందిన 20 తెలుగు సంఘాల ప్రతినిధులు పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. శిష్ట వ్యవహారికభాష- నివేదిక అనే తెలుగు గ్రంథాన్ని ఆవిష్కరించిన కళారత్న డాక్టర్ ఆర్.వి.ఎస్.సుందరం మాట్లాడుతూ గ్రాంథిక తెలుగుభాషను సరళం చేసి సామాన్యుల భాషగా తీర్చిదిద్దిన గిడుగు వెంకట రామమూర్తి భాషోద్యమ పితామహుడని కొనియాడారు. తెలుగు ప్రజలు ఆంగ్ల వ్యామోహాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో తెలుగు రెండో స్థానం నుంచి నాలుగో స్థానానికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక తెలుగు సంఘాల సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు కొమ్మరాజు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని తెలుగు సంఘాలను ఒక తాటిపైకి తీసుకురావటమే ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రముఖులు కె.కోటేశ్వరరావు, ఆర్.ఆదికేశవులనాయుడు, ఇడమకంటి లక్ష్మిరెడ్డి, లోకేశ్వరరావు, ఓఎస్‌వీ రమణమూర్తి ఆచార్య శ్రీపతి, లక్ష్మీశరత్ అన్నపూర్ణ, కృష్ణయ్యనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు సుందరం, రాజేశ్వరి, రమణబాబు తదితరులను సమితి అధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆఖరులో నిర్వహించిన సుందర నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది.

అలరించిన కళాకారుల సుందర నృత్య ప్రదర్శన

కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు విజ్ఞాన సమితి, సమాఖ్య ప్రతినిధులు

కంటికి ఇంపు.. చిత్ర సొబగుల సొంపు!


పచ్చదనం మధ్యలో సాగే ఉద్యాననగరి మెట్రో

బెంగళూరు (గాంధీ నగర), న్యూస్‌టుడే : ఐదున్నర దశాబ్దాల నుంచి ఛాయాచిత్రగ్రాహకులను ప్రోత్సహిస్తున్న యూత్ ఫొటోగ్రఫిక్ సొసైటీ బెంగళూరులోని ప్రభుత్వ చిత్రకళా పరిషత్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. ఆదివారం రాత్రి వరకు ప్రదర్శన కొనసాగనుంది. ప్రతి ఏటా ఆగస్టు 19న ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవాన్ని ఆచరిస్తుంటారు. ఈసారి ప్రదర్శనలో సొసైటీ ప్రతినిధులు, ఔత్సాహికులు తీసిన ఫొటోల్లో అత్యుత్తమమైనవి ఎంచుకుని అందుబాటులోకి తెచ్చామని వైపీఎస్ అధ్యక్షుడు వి.మంజు వికాస్‌శాస్త్రి, ఉపాధ్యక్షుడు గిరీశ్ అనంతస్వామి తెలిపారు. ‘రీఫ్రేమ్, షూట్, షేర్, విన్’ నినాదంతో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పోటీల్లో ప్రతి రెండు గంటలకు ఒకసారి తాము తీసిన ఫొటోలను తీసుకువస్తే, వాటిలో అత్యుత్తమ ఫొటోలకు బహుమతులు ఇస్తున్నామని కార్యదర్శి ప్రేమా కాకడే చెప్పారు. ‘వెటోరమ’ పేరిట ప్రదర్శనలో ఉంచిన ఫొటోలకు ఓట్లు వేసి, అత్యుత్తమ చిత్రాలను ఎంపిక చేయడంతో పాటు చక్కని రీల్స్ చేసి బహుమతులను పొందవచ్చని ఆమె వివరించారు.

నీరు తాగేందుకు వచ్చిన పులి..

ఊసులాడుకుంటున్న కొంగ జాతి పక్షులు

రోడ్డుప్రమాదంలో 20 మందికి గాయాలు

శివమొగ్గ, న్యూస్‌టుడే : సాగర తాలూకా ఆనందపుర సమీపంలోని కాస్పోడి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో 10 మంది విద్యార్థులు ఉన్నారు. ఎదురుగా వస్తున్న వ్యానును ప్రైవేటు బస్సు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదం సంభవించినప్పుడు బస్సులో 48 మంది ప్రయాణికులు ఉన్నారు. బాధితులను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా, వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఆనందపుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సముద్రుడా.. శాంతించు

మంగళూరు, న్యూస్‌టుడే : చేపల వేట సీజను ఊపందుకున్నప్పటికీ, అరేబియా సముద్రంలో అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో మత్స్యకారులు సముద్ర పూజ చేయించుకున్నారు. తీర ప్రాంతంలో వందల ఏళ్ల కిందట మత్స్యసంపద దొరక్క కరవు వచ్చింది. అప్పటి నుంచి కద్రి కదళీ జోగి మఠం నుంచి వచ్చే అర్చకులు సముద్రునికి పూజలు చేస్తూ వస్తున్నారు. తణ్ణీరు బావి వద్ద సముద్ర తీరంలో అర్చకునితో కలిసి మత్స్యకారుల కుటుంబాలు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. చేపల వేటకు ఎలాంటి ఆటంకాలూ ఎదురు కాకుండా ప్రార్థించారు.

విశాల కర్ణాటక ప్రగతికే కంకణం

సమావేశ వేదికపై విజయేంద్ర తదితరులు

తుమకూరు, న్యూస్‌టుడే : అభివృద్ధి అంటే ఒక్క బెంగళూరే కాదు.. రాష్ట్రమంతా ప్రగతిదాయకంగా కానరావాలని భాజపా రాష్ట్రాధ్యక్షుడు బి.వై విజయేంద్ర అభిప్రాయపడ్డారు. తుమకూరు సిద్ధగంగా ఇంజినీరింగ్ కళాశాలలో ‘కర్ణాటక సమగ్రాభివృద్ధి’ వేదిక శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. సమగ్ర కర్ణాటక ప్రగతి సాధన అందరి లక్ష్యం కావాలన్నారు. అభివృద్ధిని కాంక్షించే వారు ఇలాంటి వేదికలను రాజకీయం చేయకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రపంచమంతా నేడు బెంగళూరు వైపు చూస్తోందని, శాస్త్ర- సాంకేతికరంగాల ఉన్నతికి ఇది వేదికని ప్రకటించడాన్ని ప్రస్తావిస్తూ మిగిలిన కర్ణాటకనూ ఇలానే తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి ఎంతో కీలకమన్నారు. దేశంలో సుమారు 55 శాతం జనాభా యువతరానిదేనని గుర్తుచేశారు. వారికి ఉద్యోగ, ఉపాధి మార్గాలు విస్తరించాలన్నారు. యువశక్తిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ పని చేయకపోతే అతిపెద్ద సామాజిక సమస్య తలెత్తుతుందని, నిరుద్యోగాన్ని భరించ లేమన్నారు. మావోయిస్టు ఇతర కార్యకలాపాలకు కారణాలేంటో మొన్నటి వరకు ప్రజలకు తెలిసిన విషయమే నన్నారు. అందరికీ ఉపాధి లభిస్తే దేశం అగ్రపథంలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో తుమకూరు నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్, పారిశ్రామికవేత్త డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో వైద్యసేవ

సదస్సును ప్రారంభిస్తున్న మనీషా కొటేకర్, వీరేంద్రహెగ్గడే తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : సంప్రదాయ ఆయుర్వేద విధానంతో పంచేంద్రియాలను నియంత్రిస్తూ.. మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని భారతీయ వైద్య మండలి అధ్యక్షురాలు డాక్టర్ మనీషా కొటేకర్ అభిప్రాయపడ్డారు. ధర్మస్థల ఉజిరేలోని ఆప్తాస్ ఆయుర్వేద ట్రస్టు పదో వార్షికోత్సవం సందర్భంగా శనివారం అమృతవర్షిణి భవన్‌లో ఏర్పాటు చేసిన ‘పునర్వసు’ పేరిట అంతర్జాతీయ సదస్సును ఆమె ప్రారంభించారు. వైద్యులు నిరంతర అభ్యాసం, అధ్యయనం, పరిశోధనలతో తమ విజ్ఞానాన్ని విస్తరించుకోవాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని మనీషా కొటేకర్ సూచించారు. నైతిక విలువలతో రోగులకు వైద్యసేవలందించాలని పిలుపునిచ్చారు. ధర్మస్థల ధర్మాధికారి డి.వీరేంద్రహెగ్గడే మాట్లాడుతూ ఆయుర్వేదాన్ని దైనందిన జీవితంలో ఉపయోగించడంతో ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. ఉడుపి, హాసన, బెంగళూరులోని ఎస్.డి.ఎం.ఆయుర్వేద ఆసుపత్రులు రాయితీ ధరలకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ఉడుపి ఆయుర్వేద కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ వైద్యుడు ఎం.శరద్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోని ఆరువందల ఆయుర్వేద కళాశాలల ఆధ్వర్యంలో రాబోయే ఐదేళ్లలో ఏటా 500 మంది వాలంటీర్లను తయారుచేసి.. గ్రామాల్లో ఈ వైద్యంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వీరేంద్రహెగ్గడేను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుష్‌శాఖ కమిషనర్ సునీల్‌పన్వార్, సీఈవో శ్రద్ధాఅమిత్, ప్రముఖులు ప్రసన్న ఎన్.రావు, అనుపమ వి. చిన్నికట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జనజాగృతి

ఎన్‌సీసీ క్యాడెట్లకు మార్గదర్శనం చేస్తున్న సంబంధిత అధికారి

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : క్షయ వ్యాధి, అందుబాటులో ఉన్న చికిత్సల వివరాలతో స్థానికుల్లో జాగృతి కల్పించేందుకు ఎన్‌సీసీ క్యాడెట్లు ముందుకు వచ్చారు. ప్రెసిడెన్సీ విశ్వవిద్యాలయంతో పాటు 20 విద్యా సంస్థల నుంచి వచ్చిన 500 మంది క్యాడెట్లు ‘టీబీ ముక్త భారత్ అభియాన్’లో పాల్గొన్నారు లెఫ్టినెంట్ కల్నల్ ఓజే సింగ్, బెంగళూరు అర్బన్ జిల్లా టీబీ నివారణాధికారి డాక్టర్ సోమశేఖర్ క్యాడెట్లకు మార్గదర్శనం చేశారు. టీబీని ప్రారంభ దశల్లో గుర్తించే విధానాలు, చికిత్స చేయించుకునేలా రోగులను ప్రోత్సహించడం తదితర అంశాలను బోధించారు. విశ్వవిద్యాలయ ప్రతినిధులు డాక్టర్ ఎస్‌జే తిరువెంగడం, డాక్టర్ దినేశ్ నీలకంఠ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండకళ్లి రైతుల తిరుగుబాటు

మైసూరు : వరుణ నియోజకవర్గం పరిధి మండకళ్లి విమానాశ్రయ సమీపాన 165 ఎకరాల వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకునేందుకు కర్ణాటక పరిశ్రమల అభివృద్ధి మండలి చర్యలు చేపట్టింది. బిడది వద్ద టౌన్‌షిప్‌నకు భూములు ఇచ్చేది లేదని రైతులు ఆందోళన చేస్తున్న సమయంలోనే ఈ ప్రాంతంలో భూములపై మండలి కన్నేసింది. తాము వక్క, అరటి, కొబ్బరి, వరి సాగు చేస్తున్నామని, పొలాలను ఇవ్వబోమని రైతులు స్పష్టం చేశారు. ఆ రైతులకు రైతు సంఘాలు, స్థానిక నివాసుల సంఘాలు మద్దతు పలికాయి.

ఆరోగ్యానికి పాదయాత్ర మంచిదే

భాజపా నేతలపై బీకే నిప్పులు

బీకే హరిప్రసాద్

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : మాజీ మంత్రి బి.నాగేంద్ర రాజీనామాపై భాజపా, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. మంత్రి రాజీనామా చేస్తే భాజపా నేతలు ఉత్సవాలు నిర్వహిస్తున్నారంటూ పీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్ విరుచుకుపడ్డారు. ఆయన శనివారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ పార్టీకి-ప్రభుత్వానికి చెడ్డపేరు రాకూడదనే మంత్రి పదవికి రాజీనామా చేశారని స్పష్టం చేశారు. ఇది ఓ వికెట్ పతనమని భాజపా నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై మండిపడ్డారు. ‘ఇదేమీ ఐపీఎల్ మ్యాచ్ కాదు. ఎదురైన ఆరోపణలపై తనిఖీ సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయి. వికెట్ పడిందని ఆరోపణలు చేసే భాజపా నేతలకు వ్యతిరేకంగా ఛార్జిషీట్‌లు ఉన్నాయనే విషయం గుర్తున్నట్లు లేదు. ఎవరి తరపున ఎవరు బౌలింగ్ చేశారో బహిర్గతం చేయాలి’ అని సవాల్ చేశారు. ‘భాజపా నేతలు పాదయాత్ర చేయడం చాలా మంచిది. వారి ఆరోగ్యం బాగుపడుతుంది. వారి మధుమేహం, రక్తపోటు అదుపులోకి వస్తాయి. ఆ పార్టీలో రాజకీయ నిరుద్యోగులున్నారు. వారికి పని లేదు. ఇపుడీ పాదయాత్రలో ఉపాధి దొరుకుతుంది’ అంటూ నిప్పులు చెరిగారు. భాజపా నేతలపై లెక్కలేనన్ని అవినీతి, కుంభకోణాల కేసులు ఉన్నాయని ధ్వజమెత్తారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, సుశాంత్ మజుందార్‌లకు వ్యతిరేకంగా తలా 14 కేసులు ఉన్నాయని, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిపైనా కేసులున్నాయనే విషయం విస్మరించరాదన్నారు. దళిత- ఆదివాసీ వర్గానికి చెందిన నాగేంద్ర ఎదుగుదలను భాజపా నేతలు సహించలేక రాజీనామా చేయాలని పోరాటం చేయడం దారుణమని ఖండించారు.

జక్కూరులో స్వచ్ఛ పతాక రెపరెపలు

స్వచ్ఛతా అభియాన్‌కు వచ్చిన ప్రజల దండు

మేము సైతం.. అంటు స్వచ్ఛతా పనులకు యువతతో పాటు కదలివచ్చిన బాలలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలోని జక్కూరు రైతు సంత మార్గంలో బీఎన్‌సీసీ ఇక్రో గ్రూపు సహకారంతో గ్రేటర్ బెంగళూరు ఉద్యోగులు, పలు విద్యాలయాల విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు, పర్యావరణ కార్యకర్తలు శనివారం స్వచ్ఛ సేవకు ముందడుగు వేశారు. కార్యక్రమాన్ని బెంగళూరు ఉత్తర నగర పాలికె కమిషనర్ పి.సునీల్‌కుమార్ ప్రారంభించారు. నగర స్వచ్ఛత సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి 50 మీటర్లకు ఒక చెత్త డబ్బా ఏర్పాటు చేసేందుకు దుకాణాల యజమానులు ముందుకు రావాలని సూచించారు. నగరాన్ని స్వచ్ఛంగా, పచ్చదనంతో తులతూగేలా చేయాలన్నారు. నిత్యం వంటగదిలోనే చెత్తవిభజన చేపట్టాలని మహిళలకు సూచించారు. విద్యార్థులు సామాజిక బాధ్యతగా స్వచ్ఛగా కార్యక్రమాల్లో మరింత ఉత్సాహంగా పాల్గొనాలని ఓ విద్యాలయ ప్రిన్సిపల్ పార్వతి శేషాద్రి సూచించారు. బాలలు, యువకులు ఉత్సాహంగా వీధులను శుభ్రం చేసే పనుల్లో మమేకమయ్యారు.

ఐటీ ఊతంతో నాజూకు మార్గాలు!

ఓఆర్ఆర్‌కు కొత్త రూపురేఖలు

వైట్‌ఫీల్డ్ రహదారి ఇలా తీర్చదిద్దాలని ప్రతిపాదన

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: వాహన సంచార రద్దీ నియంత్రణ చర్యలకు ఐటీ సంస్థల సహకారం తోడైంది. బెంగళూరును పీడిస్తున్న ఈ సమస్య కట్టడి ప్రణాళికల్లోకి తొంగిచూస్తే.. దేశంలోనే అత్యంత సంచార రద్దీ ప్రదేశం బెంగళూరు అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్). ఈ మార్గంలో వాహన రాకపోకల రద్దీ నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం, అవుటర్ రింగ్ రోడ్డు కంపెనీ యాజమాన్యాలు ఒకే తాటిపైకి వచ్చాయి. అందుకోసం కార్యాచరణ పథకాన్ని సిద్ధం చేశారు. 60 కిలోమీటర్ల పొడవు కలిగిన ఈ ఓఆర్ఆర్‌లో ప్రపంచంలో ఖ్యాతి పొందిన 500 పైగా ఐటీ, బీటీ కంపెనీలు ఉన్నాయి. వాటిల్లో 7 లక్షల మందికిపైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. ఉద్యోగులు సొంత వాహనాలు లేకపోతే సంస్థ వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. అవుటర్ రింగ్ రోడ్డులో గంటకు 50 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు సంచార పోలీసులు అంచనా వేశారు. కె.ఆర్.పురం నుంచి సిల్క్‌బోర్డు కూడలి, అగర నుంచి సర్జాపుర వరకు ఐటీ కంపెనీలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఆమార్గాల్లో సంచార రద్దీ ఎక్కువ. హెబ్బాళ రింగ్ రోడ్డు కూడలిని గంటలకు 20 వేలు వాహనాలు దాటుతున్నట్లు గుర్తించారు. ఓవైపు మెట్రో పనులు సాగుతుండటంతో రద్దీ తీవ్రమైంది. కిలోమీటరు దూరం సంచరించేందుకు 10 నిమిషాల సమయం పడుతుందని ఇప్పటికే పలు సంస్థలు వెల్లడించిన విషయం విదితమే. దీంతో రద్దీగా ఉండే ప్రదేశాలు సర్జాపుర, బెళ్లందూరు, మారతహళ్లి, దొడ్డబేగూరు తదితర ప్రాంతాల్లో ప్రతి 5 కిలోమీటర్లను ఆయా కంపెనీలు దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చినట్లు బీడీఏ అధికారులు తెలిపారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో సంచార రద్దీ అదుపులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

గూరగుంటపాళ్య కూడలి అభివృద్ధికి ఈ విన్యాసాన్ని ఎంచుకున్నారు

రద్దీ నియంత్రణకు కొత్త విధానం

పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన యంత్రం

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే: నాజూకు రద్దీ వ్యవస్థ పరిచయంతో పార్కింగ్ సమస్యకు ముగింపు పలకనున్నారు. నగరంలో వాహన, ప్రజల సంచారం ఎక్కువ ఉన్న ప్రదేశాల్లో పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు బెంగళూరు కేంద్ర నగర పాలికె నాజూకు పార్కింగ్ వ్యవస్థను ప్రారంభించనుంది. తొలి విడతగా 23 ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే ఈ పార్కింగ్‌కు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసినట్లు కమిషనర్ జగదీశ్ తెలిపారు. ఈప్రయోగం సఫలమైతే 73 రహదారులకు విస్తరిస్తామని వివరించారు. ఆయా రహదారుల్లో పార్కింగ్ సుంకం వసూలు చేసేందుకు ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేస్తారు. ఈ పార్కింగ్‌తో ఏటా రూ.3 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. కమర్షియల్ స్ట్రీట్‌రోడ్డు, డిస్పెన్సరి రోడ్డు, కామరాజ్ రోడ్డు, మిల్లర్ రోడ్డు, చంద్రికా కూడలి, సెయింట్ జాన్ చర్చి రోడ్డు, సంపిగె రోడ్డు, దత్తాత్రేయ టెంపుల్ రోడ్డు, బీవీకే అయ్యంగార్ రోడ్డు, వాణివిలాస్‌రోడ్డు, మావళ్లి ట్యాంకు బండ్ రోడ్డు, మల్లేశ్వరం రైల్వే ప్యారలల్ రోడ్డు తదితర రహదారుల్లో నాజూకు పార్కింగ్ వ్యవస్థ అమలులోకి రానుంది.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్రీ లాంచింగ్ ప్రాడక్ట్ బేసిడ్ ఇన్వెస్ట్‌మెంట్, బైనారి బిజినెస్ కాన్సెప్ట్ స్త్రీ/పు. నిరుద్యోగులు, MLM, మార్కెటింగ్ లీడర్స్ లక్షల్లో వీక్లీటీమ్ సంపాదన. ✆ 7013203996.

FINANCIAL SERVICES

లేక్‌ల్యాండ్ కంపెనీ - అన్నిలోన్లు ప్రాపర్టీ LAP, బిజినెస్, వ్యవసాయ, టేకోవర్ పర్సనల్, గ్రూప్ లోన్లు @ 7% వడ్డీ. ఏజెంట్లు కావలెను. మంచి కమీషన్. 8961920779

REAL ESTATE

LAND FOR SALE

Tamilnadu Arunachala (Tiruvannamalai) 5.87 Acres Sale. Suitable for Ashrams, Institution, Farm Houses. ✆ 9840651404.

JOBS

ఆర్వీ డిజిటల్స్ - తిరుపతి నందు పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్ (ఫోటోషాప్, కోరల్ డ్రా తెలిసినవారు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 86880 56789.

Exp. ఆయాలు / వార్డ్ బాయ్స్ నర్సులు కావలెను. జీతం: 21000/-నుండి 30,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. Ph: 8096770770/ 9985601234.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

అభిషేకానికి పండ్లు సిద్ధం చేస్తున్న సుధామూర్తి

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు షురూ

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : జయనగర నంజనగూడు రాఘవేంద్రస్వామి మఠంలో శనివారం రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ముఖ్యురాలు సుధామూర్తి.. బృందావనంలో అభిషేకానికి పండ్లు సిద్ధం చేసే సేవల్లో పాల్గొన్నారు. పురోహితులు గోగి రామచంద్రాచార్యుల, కృష్ణాచార్యుల నేతృత్వంలో 108 లీటర్ల పాలతో అభిషేకం, ఐదు రకాల పండ్లు పూలతో పంచామృతాభిషేకం, పాదపూజ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సొరంగ మార్గంతో లాల్‌బాగ్‌కు ముప్పు

పోస్టర్లు ప్రదర్శిస్తున్న సంఘం ప్రతినిధులు

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : సెంట్రల్ సిల్క్ బోర్డు నుంచి హెబ్బాళ వరకు నిర్మించనున్న సొరంగ మార్గంలో లాల్‌బాగ్‌లో ఐదు శాతం పర్యావరణం దెబ్బ తింటుందని ఉద్యానవనం నడకదారుల సంఘం ప్రతినిధులు ఆరోపించారు. లాల్‌బాగ్ చెరువు వద్ద 'సేవ్ లాల్‌బాగ్' నినాదాలు రాసిన పోస్టర్లను ప్రదర్శించారు. నిరసన ప్రదర్శనలో సంఘం అధ్యక్షుడు ఎస్ ఉమేశ్, శశికుమార్, ఆచార్య బీవీ సుమ, మనోజ్, ఉష, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

హో సూ రు క బు ర్లు

ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందిని నియమిస్తాం

సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అరుణ్‌రాజ్, రంగరాజన్ తదితరులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరులోని ప్రభుత్వం ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి డాక్టర్ అరుణ్ రాజ్ పేర్కొన్నారు. హోసూరు-బెంగళూరు జాతీయ రహదారి మూకండపల్లిలోని హోటల్ ప్రాంగణంలో జరుగుతున్న రాష్ట్ర న్యూరాలజిస్టుల సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శనివారం ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించిన మంత్రి అక్కడి రోగులతో మాట్లాడారు. ఈ ఆసుపత్రిలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరో సర్జరీ విభాగాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 24 గంటలు వైద్య సేవలందేలా చర్యలు చేపడతామన్నారు. విదేశాల్లో వైద్య విద్యనభ్యసించిన 30 మంది ఇక్కడ సేవలందిస్తున్నారన్నారు. ఇక్కడికి సమీపంలోని కర్ణదాసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాను పదేళ్లు పనిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణగిరి ఎమ్మెల్యే ముకుందన్, జిల్లా న్యూరాలజీ డాక్టర్ల సంఘం ప్రముఖులు రంగరాజన్, వైద్యులు సెయిజ్యా, సత్యభామ, టి.వి.కె. పార్టీ ప్రముఖులు జాబూవార్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు బస్సు సేవలు

బస్సులో కూర్చున్న మంత్రులు కీర్తన, డాక్టర్ అరుణ్‌రాజ్, కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు సమీపంలోని చిన్న మంజేపల్లి, పంచపల్లి, బి.కింగిరిపల్లి, తళి తదితర గ్రామాలకు వెళుతున్న బస్సులను మారుమూల ప్రాంతాలకు పొడిగించారు. కార్మికులు, విద్యార్థులు, రోగులకు అనుకూలం కోసం బస్సు సర్వీసులను పెంచినట్లు కలెక్టర్ దినేశ్‌కుమార్ తెలిపారు. శనివారం హోసూరు బస్టాండ్‌లో కొత్త బస్సులను మంత్రులు కీర్తన, డాక్టర్ అరుణ్‌రాజ్, తదితరులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్.టి.సి. అధికారులు రాజరాజన్, మహమ్మద్ కలీముల్లా, శ్రీనివాసన్, హోసూరు కార్పొరేషన్ సహాయ కమిషనర్ రమేష్‌కుమార్, ఇంజినీరు విక్టర్ జ్ఞానరాజ్, బీడీవో జగదీష్‌కుమార్, శెల్లదురై తదితరులు పాల్గొన్నారు.

అంచెట్టిలో సంక్షేమ పథకాల వెల్లువ..

వస్తువులు పంపిణీ చేస్తున్న మంత్రులు

డెంకణీకోట న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ఆరోగ్య మంత్రి అరుణ్‌రాజ్ అన్నారు. అంచెట్టిలో జరిగిన సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల మంత్రి కీర్తన మాట్లాడుతూ.. మహిళాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తుందని, మహిళలు వారి సమస్యలను ధైర్యంగా తెలపాలన్నారు. అంచెట్టిలో గర్భిణీలకు ఉచిత ఆరోగ్య చికిత్స శిబిరం, సామూహిక సీమంతం చేశారు. విద్యార్థులకు ప్రత్యేక ఆధార్ శిబిరం, రక్తదాన శిబిరం, వికలాంగులకు ఉచిత సంక్షేమ పథకాల పంపిణీ, సేవా కేంద్రం, రెండు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల, 4 ఆరోగ్య కేంద్రాల ప్రారంభం, రూ.5.75 కోట్ల ఖర్చుతో అభివృద్ధి పథకాల పంపిణీ చేశారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు రామచంద్రన్, ముకుందన్, ఆకృతి చేతి, మంజుల, సోమసుందరం తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన మాజీ ముఖ్యమంత్రి

నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న పళనిస్వామి

డెంకణీకోట న్యూస్‌టుడే : అన్నాడీఎంకే నాయకుడు జేపీ జయప్రకాశ్ కుటుంబంలో వివాహానికి మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. డెంకణీకోట శివారు మల్లిగై ఫారంలో వివాహం జరిగింది. ప్రముఖులు మునుస్వామి, నైనార్ నాగేంద్రన్, గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా మాసోత్సవాలు

ప్రత్యేక అలంకరణలో వెంకటరమణస్వామి

బేరికె, చిన్నతిరుపతి, (బేరికె), న్యూస్‌టుడే : బేరికెలో వెంకటరమణస్వామి, బాగలూరు సమీప చిన్నతిరుపతిలోని వెంకటరమణస్వామి ఆలయాల్లో శ్రావణమాస శనివారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. కళాకారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. రెండు రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు హాజరయ్యారు.

దుర్భిక్ష ప్రాంతాలుగా ప్రకటించాలి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిత్రదుర్గ, న్యూస్‌టుడే : జిల్లాలో మూడు తాలూకాలను కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటించి మిగిలిన మూడింటిని ప్రకటించక పోవడం అన్యాయమని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు లక్ష్మీకాంత అభ్యంతరం తెలిపారు. శనివారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం జిల్లా పాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత మాట్లాడుతూ చిత్రదుర్గ, హొళల్కెర, మొలకాల్మూరు తాలూకాల్లో తీవ్రమైన వర్షాభావం కారణంగా పంటలు నష్టపోవడమే కాకుండా, తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడు తాలూకాలను కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులు రంగస్వామి, మంజప్ప, ఆనందప్ప, సునీత, మంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో జీవనం గడపాలి

ప్రసంగిస్తున్న పాస్టర్ కృపాకర్‌పాల్, ఎంబీ మోసెస్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నైతిక విలువలతో కూడిన జీవనం సాగిస్తే జీవితం ఆనందంగా సాగుతుందని ఆంధ్రప్రదేశ్ రాజమండ్రి మిస్పా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు ఎన్.కృపాకర్ పాల్ తెలిపారు. స్థానిక రామచంద్రపురలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి (టీబీసీ)లో జరుగుతున్న తెలుగు క్రైస్తవ కృతజ్ఞత పండగల కార్యక్రమం శనివారం కొనసాగింది. కార్యక్రమాన్ని రెవరెండ్ పాస్టర్ ఎంబీ మోసెస్‌తో కలిసి కృపాకర్ ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక సమాజంలో నైతిక విలువలు నానాటికీ దిగుజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో ప్రజలు పడే బాధలు, కష్టాలకు ఏసుక్రీస్తు శిలువపై మృతి చెందారన్నారు. క్రీస్తు చూపించిన మార్గంలో సమాజం ప్రయాణించాలన్నారు. కృతజ్ఞత పండగలు ఆదివారం కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

శరవేగంగా సాగుతున్న స్వచ్ఛ అభియాన్

శుభ్రత చేసిన తర్వాత ఖాళీ స్థలం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : చెత్త నుంచి విముక్తి అభియాన్‌ను అధికారులు శరవేగంగా కొనసాగిస్తున్నారు. ఎక్కడ ఖాళీ ప్రదేశం కనిపించినా అపరిశుభ్రంగా ఉంటే యజమానులకు నోటీసులు ఇచ్చి స్వచ్ఛత పనులు చేపడుతున్నారు. చెత్త కుప్పగా మారిన ఇళ్ల స్థలాల్లో పిచ్చిమొక్కలు, చెత్త కుప్పలు, నిర్మాణ వ్యర్థాలను జేసీబీ యంత్రాల ద్వారా తొలగించారు. తొలగించిన చెత్తను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత రెండు రోజుల్లో నగరంలో 47 ఖాళీ ఇళ్ల స్థలాలను శుభ్రం చేశారు. ఐదు టన్నుల చెత్తను డంపింగ్ యార్డులకు తరలించారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ ఇళ్ల స్థలాలను గుర్తించి చెత్తను తొలగించి దానికయ్యే ఖర్చును యజమానుల నుంచి వసూలు చేస్తున్నారు. ఇలా రెండు లక్షలకు పైగా ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అన్నింటినీ శుభ్రం చేస్తామన్నారు. అపరిశుభ్రత వల్ల లేని అసౌకర్యంతో పాటు అంటువ్యాధులు సోకే అవకాశాలు ఉన్నందున స్వచ్ఛత పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

అపరిశుభ్రత కనిపిస్తే భారీ జరిమానా

జరిమానా వసూలు చేస్తున్న మార్షల్స్

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగరంలోని వివిధ ప్రాంతాల్లో అపరిశుభ్రతకు కారణమవుతున్న వివిధ సంస్థలను గుర్తించిన జీబీఏ అధికారులు భారీ జరిమానా వసూలు చేస్తున్నారు. హోటళ్లు, ఫ్యాక్టరీలు, అపార్ట్‌మెంట్లు, మాల్స్, వాణిజ్య వ్యాపార తదితర చోట్ల తనిఖీలు చేపట్టారు. వంటగదిలో పోగవుతున్న చెత్తను తెచ్చి రహదారి, పాదచారి మార్గాల్లో వేయడం మార్షల్స్ గమనించి సంబంధిత సంస్థలకు జరిమానా విధిస్తున్నారు. కోరమంగలలోని ఓ మాల్ ముందు రహదారిని అశుభ్రత చేశారన్న కారణంతో రూ.లక్ష మారియప్పన రోడ్డులోని ఓ హోటల్‌కు రూ.17 వేలు, ఓ ప్రైవేట్ ఆసుపత్రికి రూ.75 వేలు జరిమానా విధించారు.

'క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది'

ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గోవిందరాజు, అనుచేత్ తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : రానున్న ఒలింపిక్స్‌లో కర్ణాటక క్రీడాకారులు కనీసం పది పతకాలను గెలవాలని, క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించేందుకు సిద్ధంగా ఉందని కర్ణాటక ఒలింపిక్ సంఘం (కేఓఏ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డాక్టర్ కె.గోవిందరాజు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం కర్ణాటక ఒలింపిక్ భవనంలో హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి గోవిందరాజు, క్రీడాశాఖ కమిషనర్ ఎం.ఎస్.అనుచేత్ నివాళులర్పించారు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని గోవిందరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేఓఏ కార్యదర్శి అనంతరాజు, క్రీడాకారులు సునీల్, అర్జున హేలప్ప, నితిన్ తిమ్మయ్య, ఉదయ్‌ప్రభు, జి.బీనీష్, కేఓఏ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఛాంపియన్స్ సెయింట్ జోసెఫ్ కళాశాల క్రీడాకారులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా దయానందసాగర్ కళాశాలలో నిర్వహించిన హాకీ పోటీలో పురుష, మహిళల జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. పోటీల్లో సెయింట్ జోసెఫ్స్ కళాశాల పురుష, మహిళల జట్లు విజేతలుగా నిలిచాయి. పురుషుల విభాగం ఫైనల్‌లో సెయింట్ జోసెఫ్ కామర్స్ కళాశాల 5-1 స్కోర్‌తో వివేకానంద కళాశాల జట్టుపై విజయం సాధించింది. మహిళల విభాగంలో జరిగిన తుది పోరులో సెయింట్ జోసెఫ్స్ కామర్స్ కళాశాల జట్టు 2-1 స్కోర్‌తో జ్యోతినివాస్ పీ యూ కళాశాల జట్టుపై గెలుపొంది ఛాంపియన్స్ గౌరవాన్ని దక్కించుకున్నాయి. కర్ణాటక సీనియర్ జట్టు కోచ్, మేనేజర్ పొన్నణ్ణ చెండాండ హాజరై విజేతలను అభినందించారు.

దుంతూరు చెరువు పునరుద్ధరణకు శ్రీకారం

పనులను ప్రారంభిస్తున్న అమూనివో సంస్థ ప్రతినిధులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : రామనగర జిల్లా కనకపుర తాలూకాలోని దుంతూరు చెరువును జర్మనీకి చెందిన అమూనివో ఇండియా సంస్థ దత్తత తీసుకొని పునరుద్ధరణ పనులు చేపట్టింది. పునరుద్ధరణ వల్ల చుట్టు పక్కల ఎనిమిది గ్రామాల్లో 17 వందల కుటుంబాలు లబ్ధిపొందుతాయని సంస్థ అధ్యక్షుడు ప్రశాంత్ దొరెస్వామి తెలిపారు. పది ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువులో పూడిక తొలగింపు, కట్ట, తూముల మరమ్మతులు చేపట్టి ఎక్కువ నీరు నిల్వ ఉండే విధంగా చేస్తున్నామన్నారు. భూగర్భ జలాల మట్టం పెరుగుతాయన్నారు. పరిసరాల సంరక్షణ కోసం సీఎస్ఆర్ నిధులను చెరువు మరమ్మతులు వ్యయం చేస్తున్నారు.

'మాతృభాష సంరక్షణకు సమష్టి కృషి'

తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న బొందురామస్వామి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : పరాయి భాషల వ్యామోహంతో మాతృభాషను మరిచిపోవడం బాధాకరమని కర్ణాటక తెలుగు ప్రజాసమితి అధ్యక్షుడు డాక్టర్ బొందురామస్వామి వ్యాఖ్యానించారు. తెలుగు మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఇక్కడ సమితి కార్యాలయంలో ఆయన తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఒకప్పుడు తెలుగు బడులు ఎక్కువగా ఉండేవని, ఇప్పుడు అవి మూతపడుతున్నా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలుగు భాషను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తెలుగు బడుల సంరక్షణపై ఉభయ రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులను కలిసి సమస్యలను వారి దృష్టికి తెస్తామన్నారు.

అగ్నిమాపక రంగంలో ఉద్యోగాలు పుష్కలం

కార్యక్రమంలో పాల్గొన్న అగ్నిమాపక విభాగం ముఖ్యులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: అగ్నిమాపక, అత్యవసర సేవల రంగంలో యువతకు ముఖ్యంగా సైన్స్ పట్టభద్రులకు చక్కని అవకాశాలున్నాయని మంగళూరు జోన్ ప్రాంతీయ అగ్నిమాపక అధికారి, చీఫ్ ఫైర్ ఆఫీర్ (ఇన్‌ఛార్జ్) ఎం.శంకర్ తెలిపారు. శనివారం దక్షిణ కన్నడ జిల్లా మూడబిదిరేలోని కువెంపు ఆడిటోరియంలో అగ్నిభద్రతా వ్యవస్థ, అగ్నిమాపకశాఖ పనితీరుపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో శంకర్ మాట్లాడారు. అగ్నిమాపక భద్రతా పరికరాల వినియోగం, మంటలు ఆర్పేపద్ధతులు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవల్సిన జాగ్రత్త చర్యలపై ప్రదర్శన నిర్వహించారు. ఆళ్వాస్ తరఫున శంకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ట్రస్టీ వివేక్‌ఆళ్వా, సైన్స్ విభాగాధిపతి రమ్యారాయ్ పాల్గొన్నారు.

శనీశ్వరా..చల్లగా కాపాడవయా

విశేష అలంకరణలో శనీశ్వరుడు

పావగడ, న్యూస్‌టుడే : శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మూడో శ్రావణ శనివారం పావగడ పట్టణం భక్తులతో కిక్కిరిసింది. పలు ప్రాంతాల నుంచి భక్తులు శుక్రవారం రాత్రికే చేరుకున్నారు. శనీశ్వర ఆలయంలో ఉదయాన్నే పంచామృతాభిషేకము, తైలాభిషేకాలు, నవగ్రహ పూజా కైంకర్యాలు అశేష భక్తుల మధ్య వైభవంగా జరిగాయి. రాత్రి విశేష పూలపల్లకీ ఉత్సవం రంగుల విద్యుత్తు దీపాల కాంతుల మధ్య ఘనంగా జరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాలంటీర్లు సహకరించారు. అదనపు పోలీసు బలగాలు బందోబస్తు చేపట్టాయి. బస్టాండ్‌లో వాహన చోదకుల క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు బి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు డి.ఎన్.రాము, ప్రధాన కార్యదర్శి రఘు, సభ్యులు భక్తులకు అన్న ప్రసాదాలను అందించారు.

కామాంధుడికి కటకటాలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ప్రైవేట్ వసతి గృహాల్లో (పీజీ) యువతుల లోదుస్తులు, శ్యానిటరీ ప్యాడ్ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు గిరిరాజ్‌ను కోరమంగల పోలీసులు అరెస్టు చేశారు. కోరమంగలలోని పీజీ కేంద్రాల్లో యువతుల లోదుస్తులు మాయమవుతుండటంతో కొందరు యువతులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రాత్రిళ్లు నిఘా వేసి నిందితుడిని అరెస్టు చేశారు.

రౌడీషీటర్ అరెస్టు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : ఎనిమిదేళ్ల నుంచి న్యాయస్థానంలో విచారణకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న రౌడీషీటర్ సయ్యద్ పర్వేజ్‌ను సుద్దగుంటపాళ్య పోలీసుఠాణా పరిధిలోని గురప్పనపాళ్య వద్ద శుక్రవారం రాత్రి సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిపై 22 దోపిడీలు, 11 బంగారు గొలుసు దొంగతనాలు తదితర 40కు పైగా నేరాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

సేవా భావాన్ని పెంపొందించుకోవాలి

సత్కారం అందుకున్న ప్రధానఅతిథితో వర్సిటీ ప్రతినిధులు, ఆచార్యులు

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: వేగంగా మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో యువతకు మార్గదర్శనం, భాగస్వామ్యం, సమాజ సేవ చేసే మనోభావాన్ని పెంపొందించుకునేలా చేయాలని ఆర్థిక అదనపు ముఖ్య కార్యదర్శి రితేన్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. ఆర్‌వీ విశ్వవిద్యాలయంలో 4వ స్నాతకోత్సవంలో ఇద్దరు పీహెచ్‌డీ విద్యార్థులతో కలిపి 918 మందికి పట్టాలు ప్రధానం చేశారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ చూపించిన 42 మంది విద్యార్థులకు ర్యాంకులు, పతకాలు అందజేసి మాట్లాడారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను చాకచక్యంతో ఎదుర్కొనేందుకు అనుక్షణం అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల కులపతి ఆచార్య రామ్ కుమార్ కాకాని, యాజమాన్య ప్రతినిధులు, ఆచార్యులు పాల్గొన్నారు.

ఆభరణాల ప్రదర్శన ప్రారంభం

ఆభరణాలను ప్రదర్శిస్తున్న నటి, రూపదర్శి

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : పండగలు, వివాహాల సీజన్ నేపథ్యంలో తాజ్ వెస్ట్ ఎండ్‌లో గోల్డెన్ క్రీపర్ ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటు చేసిన ది జ్యూవెలరీ షో శనివారం ప్రారంభమైంది. డాక్టర్ రాజ్‌కుమార్ కుమార్తె లక్ష్మి, నటి సోనాల్ మొంథెరో ప్రదర్శనను ప్రారంభించారు. సోమవారం సాయంత్రం వరకు కొనసాగే ప్రదర్శనలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆభరణాల వ్యాపారులు, తయారీదారులు 50 వేలకు పైగా డిజైన్ల నగలను తమ స్టాళ్లలో ప్రదర్శించారు. నచ్చిన డిజైన్లలో ఆభరణాలను తయారు చేయించుకునేందుకు వినియోగదారుల నుంచి ఆయా నగల సంస్థల ప్రతినిధులు ఆర్డర్లు తీసుకున్నారు.

జిల్లాలో ఎనిమిది తాలూకాల్లో కరవు

చిక్కబళ్లాపుర : నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని జిల్లా ఇన్‌ఛార్జ్ కార్యదర్శి డాక్టర్ ఎన్.మంజుళ పిలుపునిచ్చారు. ఇళ్లకు సరఫరా చేసే నీటి కుళాయిలకు మీటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలోనే నీటికి కొరత తీవ్రంగా ఉండడంతో ఎనిమిది తాలూకాలను తీవ్ర కరవు పీడిత తాలూకాలుగా ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. బెంగళూరు జలమండలి, భూగర్భ మురుగునీటి బోర్డు ద్వారా కుళాయిలకు మీటర్లు బిగించే ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పారు. ప్రభుత్వ హాస్టళ్లు, బడుల్లో మధ్యాహ్న భోజనం తయారీ, వాటి నాణ్యతను ఆమె పరిశీలించారు. తాగు నీటి సమస్య ఉన్న 38 గ్రాములకు ప్రైవేటు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

నయనానందం..శ్రావణ శనివార పూజలు

పుష్పమాలాం కృత పద్మావతీదేవి

గజమాలలలో వేంకటేశ్వరుడు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : నగరంలోని వైష్ణవాలయాలు, ఆంజనేయుడి ఆలయాల్లో మూడో శ్రావణ శనివార పూజలు కొనసాగాయి. విష్ణు స్వరూపాల అలంకారాలు భక్తులను మంత్రముగ్ధుల్ని చేశాయి. హనుమంతనగర్‌లోని బలమురి శేషమహాగణపతి ఆలయంలో వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, తిరుప్పావై పారాయణ, విష్ణుసహస్ర నామ పారాయణలు, హోమాలను నిర్వహించారు. శ్రీవారిని వెండి కవచ అలంకారం, గజమాలతో ముస్తాబు చేశారు. దేవేరి పద్మావతి మెరిసిపోయే పట్టుచీరలో సుందర పుష్పమాలికలు, ఆభరణాలతో భక్తులను పరవశింపజేసింది. భక్తులు దేవతలను కనులారా వీక్షించారు.

దేదీప్యమానంగా ముస్తాబైన ఆలయాలు

కొలువుదీరిని చౌడేశ్వరి

ముళబాగిలు, న్యూస్‌టుడే : కోలారు జిల్లా కోలారు వ్యాప్తంగా శ్రావణమాసం మూడో వారం సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోలారు నగరంలోని కోలారమ్మ, కేజీఎఫ్ నగరం, తాలూకాలోని గుట్టహళ్లి (దక్షిణతిరుపతి) వేంకటరమణస్వామి, ముళబాగిలు ఆంజనేయస్వామి, అంబరాజు కొండపై వెలసిన ఆదినారాయణ, పంచముఖి ఆంజనేయస్వామి ఆలయాల్లో దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు.

నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు

సహృదయులు, మృదుస్వభావి,
స్వయంకృషితో వైద్యరంగంలో
అంచలంచలుగా ఎదిగి,
ఎదిగినకొద్ది ఒదిగి ఉండి
మీరు ఆరోగ్యం క్షేత్రంలో
సమాజ శ్రేయస్సుకోసం నిరంతరం కృషిచేస్తూ..
ఎందరో జీవితాలకు సేవ చేసిన మీరు మాకు మార్గదర్శకులు.

డా॥ సాంబశివ గారు, శ్రీమతి జయమాల గారు, హృదయా
శ్రీ లక్ష్మి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్
Directors Samjaya Health Care Ltd. Bangalore
at No. 7/30, Ist Main Road, 5th Cross, Nagappa Reddy Layout
(Near Sri Lakshmi Hospital) Kaggadasapura, Bangalore - 560093
నందు కొత్తగా నిర్మించిన సిరివన అను నిలయంను 30-08-2026 ఆదివారం గృహప్రవేశం చేస్తున్న శుభసందర్భంగా వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

With Best Wishes from
Management, Doctor's and Staff Members
Samjaya Health Care Ltd.
(Sri Lakshmi Group of Hospitals) Bangalore

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
బ్రాంచ్ : డి.నెం.26-2-7, 2వ అంతస్థు, పద్మావతి ప్లాజా, సిండికేట్ బ్యాంక్ ప్రక్కన, ఎ.కె.నగర్, నెల్లూరు.

లాంఛనముగా స్వాధీనత ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది. ఎన్‌సిఎల్‌టి బెంచ్-॥ చెన్నై, తేది.09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము.

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (రూల్సు) ప్రకారం శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (యస్‌యఫ్‌యల్) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని సెక్షన్ 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 సందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఋణగ్రహీతలు ఈ క్రింద తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించవలసినదిగా క్రింద ఉదహరించబడిన తేదీన డిమాండు నోటీసు జారీ చేయడమైనది.

బకాయిసొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4) తో అనుబంధమైన సదరు రూల్స్ సందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని ది.27-08-2026న లాంఛనముగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఋణగ్రహీతల యొక్క పేరు మరియు చిరునామా :

1) అన్నమయ ఫైర్ ప్రొటెక్షన్ కంపెనీ, ప్రొప్రైటర్: అందె వెంకట రమణయ్య, డోర్ నంబర్: 26-1-30, 1వ అంతస్తు, గాంధీ నగర్, 2వ లైన్, నెల్లూరు, నెల్లూరు జిల్లా- 524 004.

2) అందే వెంకట రమణయ్య, తండ్రి: లచ్చయ్య, డోర్ నంబర్: 26-1-30, 1వ అంతస్తు, గాంధీ నగర్, 2వ లైన్, నెల్లూరు, నెల్లూరు జిల్లా - 524004.

3) ఎ. అరుణ, భర్త: వెంకట రమణయ్య, నంబర్:4 కె నంబర్:468, జయశ్రీ లేఅవుట్, 3వ క్రాస్ రోడ్, రామ్మూర్తి నగర్, బెంగళూరు నార్త్, బెంగళూరు, కర్ణాటక-560047.

4) జ్యోతి చిన్న యర్రయ్య, తండ్రి: చిన్నయ్య, డోర్ నంబర్: 9బి-63-2, కోదండ రామాపురం, బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు జిల్లా - 524305.

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము రూ. **36,21,900/-** (అక్షరాల ముప్పై ఆరు లక్షల ఇరవై ఒక్క వేల తొమ్మిది వందల రూపాయలు మాత్రమే)

లోన్ అకౌంట్ నెంబరు : **NELL3TF1712300017**

డిమాండ్ నోటీసు తేది : **22-11-2025.**

స్థిరాస్తుల వివరములు

స్థిరాస్తుల వివరములు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, బుచ్చిరెడ్డిపాలెం సబ్ జిల్లా, బుచ్చిరెడ్డిపాలెం మండల రూరల్ గ్రామ పంచాయితీ మరియు విలేజ్ అకౌంట్స్ పరిధిలో **మాగాణి సర్వే నంబర్ 37/1-1** లోని మొత్తం ఎకరా 0.74 సెంట్లలో ఎకరా 0.45 సెంట్లు, **మాగాణి సర్వే నంబర్ 35/1-2ఎ** లోని మొత్తం ఎకరా 0.35 సెంట్లలో ఎకరా 0.14 సెంట్లు, **మాగాణి సర్వే నంబర్ 26-బి** లోని మొత్తం ఎకరా 0.27 సెంట్లలో ఎకరా 0.11 సెంట్లు, **మాగాణి సర్వే నంబర్ 28/ఎ6** లోని మొత్తం ఎకరా 0.40 సెంట్లలో ఎకరా 0.21 సెంట్లు, **మాగాణి సర్వే నంబర్ 28-ఎ8** లోని ఎకరా 0.09 సెంట్లు, **మాగాణి సర్వే నంబర్ 25/3** లోని ఎకరా 0.09 సెంట్లు, **మాగాణి సర్వే నంబర్ 26-సి** లోని ఎకరా 0.36 సెంట్లు, **మాగాణి సర్వే నంబర్ 28/ఎ10** లోని ఎకరా 0.25 సెంట్లు, **మాగాణి సర్వే నంబర్ 37/1-2** లోని మొత్తం ఎకరా 0.81 సెంట్లలో ఎకరా 0.75 సెంట్లు, **మాగాణి సర్వే నంబర్ 27/ఎ2** లోని మొత్తం ఎకరా 0.42 సెంట్లలో ఎకరా 0.15 సెంట్లు, **మాగాణి సర్వే నంబర్ 28/ఎ7** లోని మొత్తం ఎకరా 0.15 సెంట్లలో ఎకరా 0.05 సెంట్లు, పై సర్వే నెంబర్ల లోని మొత్తం ఎకరాలు 2.65 సెంట్లు లేదా 1.073 హెక్టార్ల గల భూమిని **ఆర్ కే నగర్** అను లేఅవుట్ క్రింద ఇండ్ల స్థలాలుగా మార్చడమైనది. అందులోని **ప్లాట్ నంబర్ 26** కు హద్దులు : **తూర్పు:** 30 అడుగుల వెడల్పు గల రోడ్డు-35 అడుగులు, **పడమర:** ప్లాట్ నంబర్ 21-35 అడుగులు, **ఉత్తరం:** ప్లాట్ నంబర్ 25-65 అడుగులు, **దక్షిణం:** ప్లాట్ నంబర్ 27-65 అడుగులు
ఈ సరిహద్దుల మధ్య గల **31** అంకణములు మరియు **43** చదరపు అడుగులు లేదా **252.77** చదరపు గజములు లేదా **211.38** చదరపు మీటర్లు విస్తీర్ణం కలిగిన ఖాళీ స్థలం మాత్రమే.
పై షెడ్యూల్ ఆస్తి అందే వెంకట రమణయ్య, తండ్రి: లచ్చయ్య గారి పేరు మీద ఉన్నది.

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (యస్‌యఫ్‌యల్) అధీకృత అధికారి పైన పేర్కొనబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తరువాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖాఆస్తులను దారి మళ్లించుట గానీ యస్‌యఫ్‌యల్ వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

తేది : 27-08-2026, ప్రదేశం: నెల్లూరు-2. సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

నేపాల్ బాధితులకు సహకారం

డీకే శివకుమార్‌ను సత్కరిస్తున్న మైసూరు నాయకులు

మైసూరు, న్యూస్‌టుడే : నేపాల్‌లో ఆకస్మికంగా వచ్చిన వరదల్లో చిక్కుకున్న కన్నడిగులను సురక్షితంగా తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. మైసూరు పర్యటనకు శనివారం విచ్చేసిన ఆయనను హెలిప్యాడ్ వద్ద స్థానికులు, నేతలు సత్కరించారు. నేపాల్ నుంచి మొదట దిల్లీకి వస్తున్న కన్నడిగులకు వసతి సదుపాయాలు కల్పిస్తున్నామని, అక్కడి నుంచి వారిని బెంగళూరుకు తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు

మాన్వి, న్యూస్‌టుడే: పట్టణంలోని గురురాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం స్వామివారికి పూర్వారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బృందావనాన్ని వివిధరకాల పుష్పాలతో అలంకరించారు. ప్రాణేశాచార్య రాఘవేంద్ర జీవిత చరిత్రను వివరించారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన బ్రాహ్మణ, ఆర్య వైశ్య సముదాయ ప్రముఖులను సత్కరించారు. డాక్టర్లు రోహిణీమాన్విකర్, అజిత్ కులకర్ణి, హరిప్రసాద్, అశ్వనికాంత్, హరీష్‌మూర్తి, ముద్దురంగరావ్ పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో గురు రాఘవేంద్రస్వామి

నవోదయలో రేడియో సేవలు

ప్రారంభ కార్యక్రమంలో ఎంపీ, బోసురాజు

రాయచూరు, న్యూస్‌టుడే: విద్య, వైద్య రంగాల సేవల్లో రాష్ట్రంలో అగ్రవరుసలో ఉన్న రాయచూరు నవోదయ విద్యా సంస్థ ప్రసారమాధ్యమ రంగంలోకి అడుగుపెట్టింది. జిల్లాలో ప్రథమంగా ప్రైవేటు ఎఫ్.ఎం. రేడియో సేవలకు శ్రీకారం చుట్టింది. క్రీడా మైదానంలో నెలకొల్పిన 88.4 ఎఫ్.ఎం. ఆకాశవాణి కేంద్రాన్ని ఎంపీ కుమారనాయక్ శనివారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ..జిల్లా విశిష్టత, చారిత్రక కట్టడాలు, ఇతిహాస నేపథ్యం, ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. వైద్య సేవలు, విద్యార్థుల విజయాలు, పరిశోధనల ఫలితాలను ప్రచారం చేయటానికి రేడియో దోహదపడగలదన్నారు. సంస్థల అధ్యక్షుడు సుంకి రాజేంద్రరెడ్డి అనుకున్న లక్ష్యాన్ని అధిగమించే వరకు విశ్రమించనందునే దేశస్థాయిలో నవోదయకు గుర్తింపు లభించినట్లు తెలిపారు. తాను 1999లో జిల్లా పాలనాధికారిగా ఉన్నప్పుడు రెడ్డి తనను కలిసి వైద్య కళాశాల స్థాపనకు అవసరమైన భూమికి ఎన్.ఎ. ఇవ్వాలని అడిగినట్లు గుర్తు చేశారు. మాజీ మంత్రి బోసురాజు మాట్లాడుతూ.. రాజేంద్రరెడ్డి సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నందున, కఠిన నిర్ధారణలు చేయడంతోనే ఈ స్థాయికి ఎదిగారన్నారు. క్రీడా మైదానాన్ని ముఖ్యమంత్రితో ప్రారంభించేందుకు సంపూర్ణంగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. రెడ్డి మాట్లాడుతూ..సమాజానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసేలా ఆకాశవాణిని తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ప్రముఖులు శ్రీనివాస్, అమృతరెడ్డి, రామమోహన్ గుప్తా, విజయకుమార్, సురేష్ బాబు, దొడ్డయ్య, సంకురాత్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారుల పొడవునా కల్పతరువులు!

మైసూరు, న్యూస్‌టుడే : రహదారుల పక్కన, ప్రభుత్వ స్థలాలు, రైతుల భూముల్లో కల్పతరువులుగా పేరొందిన కొబ్బరి మొక్కలు నాటించే 'తేగద సిరి' కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకువస్తుందని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. ఈ పథకానికి సహకరించే రైతులకు 70 శాతం, ప్రభుత్వానికి 30 శాతం లాభాలను పంచుకుంటామన్నారు. దీని కోసం ఒక కోటి కొబ్బరి మొక్కలను అటవీశాఖ సహకారంతో పంపిణీ చేస్తామని వెల్లడించారు. తనకు దొరికిన అధికారం, అవకాశాన్ని పూర్తిగా జనసేవకే కేటాయిస్తానని చెప్పారు. ఇచ్చిన మాటను నెరవేర్చే వారే నిజమైన నాయకులన్నారు. మహారాష్ట్రలో గ్యారంటీ పథకాలకు ప్రకటించి, వాటిని అమలు చేయలేదన్నారు. విద్యా విప్లవానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు మఠాలు మద్దతు ఇవ్వడాన్ని అభినందించారు. భూమి, నీరు, భాష విషయంలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా ఒకేతాటిపై ఉండాలన్నారు. శివరాత్రి రాజేంద్ర స్వామి 111వ జయంతిని మఠాధిపతి శివరాత్రి దేశికేంద్ర స్వామి, సిద్ధలింగ స్వామి, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రి యతీంద్ర తదితరులతో కలిసి శనివారం ప్రారంభించి మాట్లాడారు. వచ్చే పాతికేళ్లలో పచ్చదనం ఎక్కువగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఎస్ఎం కృష్ణ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆదిచుంచనగిరి మఠాధిపతి బాలగంగాధరనాథ స్వామితో కలిసి ఐదు కోట్ల మొక్కలు పంచారని గుర్తు చేశారు. కావేరి నది ఆధారిత మేకెదాటు పథకంతో తమిళనాడుకు కూడా ప్రయోజనం ఉంటుందని అక్కడి ముఖ్యమంత్రి విజయ్ జోసెఫ్‌కు చెప్పానన్నారు. తుంగభద్ర విషయంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో చర్చించామన్నారు. ఆలమట్టి, కేఆర్ఎస్‌లో పూడిక తీత పనుల కార్యాచరణ చేపట్టేందుకు కేంద్రం ఇప్పటికే ప్రత్యేక విధానాన్ని రూపొందించిందని తెలిపారు. శివారాత్రి, సిద్ధగంగ మఠాలు ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి, అన్నదాసోహకు పెద్ద పీట వేశాయని కీర్తించారు. ఆకలికి అన్నం, మనసు ఆకలికి ప్రార్థన అవసరం అన్నారు. కర్ణాటకలో 46,302 ప్రాథమిక పాఠశాలలు, 24 వేల ప్రైవేటు పాఠశాలలు ఉండగా, వరుసగా 36 లక్షలు, 57 లక్షల మంది చదువుకొంటున్నారని తెలిపారు. వారందరి శ్రేయస్సుకు రాష్ట్రంలోని అన్ని మఠాలు ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాయని కొనియాడారు.

రాజేంద్రస్వామి విగ్రహానికి నమస్కరిస్తున్న శివకుమార్

మఠాధిపతులు, నేతలతో కలిసి జ్యోతి వెలిగిస్తూ..

ఆరోగ్యానికి పాదయాత్ర మంచిదే

● భాజపా నేతలపై బీకే నిప్పులు

బీకే హరిప్రసాద్

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : మాజీ మంత్రి బి.నాగేంద్ర రాజీనామాపై భాజపా, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. మంత్రి రాజీనామా చేస్తే భాజపా నేతలు ఉత్సవాలు నిర్వహిస్తున్నారంటూ పీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్ విరుచుకుపడ్డారు. ఆయన శనివారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ పార్టీకి- ప్రభుత్వానికి చెడ్డపేరు రాకూడదనే మంత్రి పదవికీ రాజీనామా చేశారని స్పష్టం చేశారు. ఇది ఓ వికెట్ పతనమని భాజపా నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై మండిపడ్డారు. 'ఇదేమీ ఐపీఎల్ మ్యాచ్ కాదు. ఎదురైన ఆరోపణలపై తనిఖీ సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయి. వికెట్ పడిందని ఆరోపణలు చేసే భాజపా నేతలకు వ్యతిరేకంగా ఛార్జిషీట్‌లు ఉన్నాయనే విషయం గుర్తున్నట్లు లేదు. ఎవరి తరపున ఎవరు బౌలింగ్ చేశారో బహిర్గతం చేయాలి' అని సవాల్ చేశారు. 'భాజపా నేతలు పాదయాత్ర చేయడం చాలా మంచిది. వారి ఆరోగ్యం బాగుపడుతుంది. వారి మధుమేహం, రక్తపోటు అదుపులోకి వస్తాయి. ఆ పార్టీలో రాజకీయ నిరుద్యోగులున్నారు. వారికి పని లేదు. ఇపుడీ పాదయాత్రలో ఉపాధి దొరుకుతుంది' అంటూ నిప్పులు చెరిగారు. భాజపా నేతలపై లెక్కలేనన్ని అవినీతి, కుంభకోణాల కేసులు ఉన్నాయని ధ్వజమెత్తారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, సుశాంత్ మజుందార్‌లకు వ్యతిరేకంగా తలా 14 కేసులు ఉన్నాయని, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిపైనా కేసులున్నాయనే విషయం విస్మరించరాదన్నారు. దళిత- ఆదివాసీ వర్గానికి చెందిన నాగేంద్ర ఎదుగుదలను భాజపా నేతలు సహించలేక రాజీనామా చేయాలని పోరాటం చేయడం దారుణమని ఖండించారు. కరవు సమస్యలపై శాసనసభ సమావేశాల్లో చర్చలు జరగకుండా భాజపా-జేడీఎస్ సభ్యులు అడ్డుకున్నారని నిందించారు.

కరవు సహాయక పనులకు సన్నద్ధం కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాయచూరు, న్యూస్‌టుడే: తాలూకాను దుర్భిక్ష ప్రాంతంగా ప్రకటించిన నేపథ్యంలో కరవు సహాయక పనులను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ సూచించారు. నగరంలోని తాలూకా పంచాయతీ సభా భవనంలో శనివారం టాస్క్‌ఫోర్స్ సమితి సమావేశం జరిగింది. బసనగౌడ మాట్లాడుతూ.. కరవు పరిస్థితుల కారణంగా ప్రభుత్వం రూ.50 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించిందని, ఈ నిధులను తాగునీటి పనులు చేపట్టేందుకు, పశుగ్రాసాన్ని కొనుగోలు చేసేందుకు, అన్నదాతలకు పరిహారాన్ని అందజేయటానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. తాగునీటి సమస్య ఉద్భవించిన గ్రామాలకు ప్రైవేటు బోరుబావుల్లో నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయించాలని, అవసరమైతే కొత్త బోర్లను తవ్వించాలని, అర్ధాంతరంగా నిలిపివేసిన పైపులైన్ పనులను పూర్తి చేయించాలని నిర్దేశించారు. పరిహారాన్ని చెల్లించేందుకుగానూ క్షేత్ర స్థాయికి వెళ్లి ప్రతిరైతు పంట నష్టాన్ని సమీక్షించాలని, బ్యాంకు ఖాతా, పట్టా ఫారం, ఇతర దాఖలాలను సేకరించాలని స్పష్టం చేశారు. ఉపాధి వలసలను తప్పించేందుకు వీబీ జీ రామ్‌జీ పథకంలో వీలైనంత ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించాలని సూచించారు. సాగు పంటలకు కావాల్సినంత ఎరువులను పంపిణీ చేయాలని వ్యవసాయశాఖ అధికారిని కోరారు. ప్రతి విధానసభ నియోజకవర్గంలో 50 వేల మంది పేదలకు గృహాలను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకున్నందున అర్హుల జాబితాను రూపొందించాలన్నారు. తహసీల్దార్ సురేష్ వర్మ, తాలూకా పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ పవార్ వేదికను అలంకరించారు.

విశాల కర్ణాటక ప్రగతికే కంకణం

సమావేశ వేదికపై విజయేంద్ర తదితరులు

తుమకూరు, న్యూస్‌టుడే : అభివృద్ధి అంటే ఒక్క బెంగళూరే కాదు.. రాష్ట్రమంతా ప్రగతిదాయకంగా కానరావాలని భాజపా రాష్ట్రాధ్యక్షుడు బి.వై విజయేంద్ర అభిప్రాయపడ్డారు. తుమకూరు సిద్ధగంగా ఇంజినీరింగ్ కళాశాలలో 'కర్ణాటక సమగ్రాభివృద్ధి' వేదిక శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. సమగ్ర కర్ణాటక ప్రగతి సాధన అందరి లక్ష్యం కావాలన్నారు. అభివృద్ధిని కాంక్షించే వారు ఇలాంటి వేదికలను రాజకీయం చేయకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రపంచమంతా నేడు బెంగళూరు వైపు చూస్తోందని, శాస్త్ర- సాంకేతికరంగాల ఉన్నతికి ఇది వేదికని ప్రకటించడాన్ని ప్రస్తావిస్తూ మిగిలిన కర్ణాటకనూ ఇలానే తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి ఎంతో కీలకమన్నారు. దేశంలో సుమారు 55 శాతం జనాభా యువతరానిదేనని గుర్తుచేశారు. వారికి ఉద్యోగ, ఉపాధి మార్గాలు విస్తరించాలన్నారు. యువశక్తిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ పని చేయకపోతే అతిపెద్ద సామాజిక సమస్య తలెత్తుతుందని, నిరుద్యోగాన్ని భరించ లేమన్నారు. మావోయిస్టు ఇతర కార్యకలాపాలకు కారణాలేంటో మొన్నటి వరకు ప్రజలకు తెలిసిన విషయమేనన్నారు. అందరికీ ఉపాధి లభిస్తే దేశం అగ్రపథంలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో తుమకూరు నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్, పారిశ్రామికవేత్త డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి

మాట్లాడుతున్న విశ్వవిద్యాలయం సంచాలకురాలు జ్యోతి

సిరివార(మాన్వి), న్యూస్‌టుడే: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంచాలకురాలు జ్యోతి పేర్కొన్నారు. స్థానిక అమరేగౌడ బయ్యాపూర్ పదవి కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం, ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యసనముక్త భారత అభియానను ప్రారంభించి మాట్లాడారు. భారతీయులకు ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న గౌరవ మర్యాదలకు కారణం మన సంస్కృతి, సంప్రదాయాలేనన్నారు. యువత మత్తుకు, తాత్కాలిక ఆనందాలకు బానిసలుగా మారడం ఆందోళన కల్గించే విషయమన్నారు. వ్యసన ముక్తభారతవని కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ యోజనాధికారి పి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత దేశఆస్తి అన్నారు. ఆరోగ్యవంత యువత ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుందన్నారు. అధ్యాపకులు హనుమంతు, హులిగెప్ప, నరసప్ప, ప్రభణ్ణ, సహనా, లక్ష్మి పాల్గొన్నారు.

అనుమానాదస్పద స్థితిలో యువకుడి మృతి

మాన్వి,న్యూస్‌టుడే: తాలూకాలోని కవితాళ సమీపంలోని హుసేన్‌పుర చేలో రామణ్ణ (25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మాన్వి సీఐ సోమశేఖర్ వివరాల ప్రకారం..తాలూకాలోని నక్కుంది గ్రామానికి చెందిన రామణ్ణ బెంగళూరులో వాహన చోదకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. 4 రోజుల క్రితమే బెంగళూరు నుంచి వచ్చినా గ్రామానికి వెళ్లలేదు. శనివారం మధ్యాహ్నం హుసేన్‌పురా సమీపంలోని ఓ పొలంలో శవంగా కనిపించాడు. పొలం రైతు అయ్యప్ప చేలో మృతదేహం ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు స్థల పరిశీలన చేశారు. కుటుంబసభ్యులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఆయన తెలిపారు.

జక్కూరులో స్వచ్ఛ పతాక రెపరెపలు

స్వచ్ఛతా అభియాన్‌కు వచ్చిన ప్రజలదండు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలోని జక్కూరు రైతు సంత మార్గంలో బీఎన్‌సీసీ ఇక్రో గ్రూపు సహకారంతో గ్రేటర్ బెంగళూరు ఉద్యోగులు, పలు విద్యాలయాల విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు, పర్యావరణ కార్యకర్తలు శనివారం స్వచ్ఛ సేవకు ముందడుగు వేశారు. కార్యక్రమాన్ని బెంగళూరు ఉత్తర నగర పాలికె కమిషనర్ పి.సునీల్‌కుమార్ ప్రారంభించారు. నగర స్వచ్ఛత సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి 50 మీటర్లకు ఒక చెత్త డబ్బా ఏర్పాటు చేసేందుకు దుకాణాల యజమానులు ముందుకు రావాలని సూచించారు. నగరాన్ని స్వచ్ఛంగా, పచ్చదనంతో తులతూగేలా చేయాలన్నారు. నిత్యం వంటగదిలోనే చెత్తవిభజన చేపట్టాలని మహిళలకు సూచించారు. విద్యార్థులు సామాజిక బాధ్యతగా స్వచ్ఛగా కార్యక్రమాల్లో మరింత ఉత్సాహంగా పాల్గొనాలని ఓ విద్యాలయ ప్రిన్సిపల్ పార్వతి శేషాద్రి సూచించారు. బాలలు, యువకులు ఉత్సాహంగా వీధులను శుభ్రం చేసే పనుల్లో మమేకమయ్యారు.

కల్యాణ కర్ణాటకను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్

లింగసుగూరు(మాన్వి), న్యూస్‌టుడే: కల్యాణ కర్ణాటక ప్రాంతాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూస్తుందని మాజీ మంత్రి కె. శివనగౌడ నాయక్ ఆరోపించారు. సెప్టెంబరు 1న లింగసుగూరు నుంచి బళ్లారి వరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పాదయాత్ర సన్నాహక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నవలి సమాంతర జలాశయం, తింథిణి బ్యారేజీ, ఏమ్స్ ఏర్పాటు అంశాలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. వీటి సాధనకు పార్టీలకు అతీతంగా ఐక్య పోరు అవసరమన్నారు. లింగసుగూరు తాలూకా నీటిపారుదల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావటంలేదని ఎమ్మెల్యే మానప్ప వజ్జల్ ఆరోపించారు. ఇందుకు నందవాడిగి ఎత్తిపోతల పథకమే నిదర్శనమన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు వీరనగౌడ పాటిల్, తాలూకా అధ్యక్షుడు నాగభూషణ్, గిరిమల్లప్ప, అయ్యప్ప, నారాయణ నాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి శివనగౌడ నాయక్

నడువీధిలో తల్వార్లతో యువకుడి నరికివేత

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : బనశంకరి లేఅవుట్‌లో నడుచుకుని వెళుతున్న వ్యక్తిని తల్వార్లతో వచ్చిన ఇద్దరు యువకులు దాడి చేసి పరాయ్యారు. తీవ్రంగా గాయపడిన బాధితుడు అక్కడికక్కడే మరణించాడు. మరణించిన వ్యక్తిని గుర్తించవలసి ఉందని నగర పోలీసు కమిషనర్ శశికుమార్ తెలిపారు. బైకుపై వెళుతున్న అతన్ని అడ్డగించిన నిందితులు తల్వార్లతో దాడి చేయడాన్ని ఒక స్థానికుడు చరవాణిలో చిత్రీకరించినట్లు గుర్తించారు. దాని ఆధారంగా విద్యానగర ఠాణా పోలీసులు నిందితుల కోసం గాలింపు తీవ్రం చేశారు.

నగరపాలక సంస్థ కమిషనర్‌కు పదోన్నతి

జుబిన్

రాయచూరు, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహోపాత్రకు పదోన్నతి లభించింది. యాదగిరి జడ్పీ సీఈవోగా బదిలీ చేస్తూ శనివారం ప్రభుత్వం ఆదేశాలు వెలువరించింది. రాయచూరుకు నూతన కమిషనర్‌ను ఇంకా నియమించలేదు. నగరసభ నుంచి వర్గోన్నతి పొందిన రాయచూరు పాలక సంస్థకు జుబిన్ తొలి కమిషనర్. నగరంలో ప్రగతిని పరుగులు పెట్టించేందుకు అప్పటి మంత్రి బోసురాజు ఈయనను ఏరికోరి తెచ్చుకున్నారు. మహోపాత్ర సమర్థవంతంగా పనిచేశారు. ప్రధానమైన పారిశుద్ధ్యం నిర్వహణను గాడిన పెట్టారు. జుబిన్ చొరవతోనే చెత్త సేకరణ వాహనాల సంచార కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ప్రధాన రహదారుల్లో విభాజకాల (డివైడర్ల) మధ్య మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మూడు రోజులు జరిగిన రాయచూరు ఉత్సవ్ జయప్రదంలో భాగస్వామయ్యారు.

ప్రభుత్వబడుల్లో సైన్స్ ల్యాబ్‌లు

పాత్రికేయులతో మాట్లాడుతున్న సీఈవో

రాయచూరు, న్యూస్‌టుడే: 'విజ్ఞాన బోధనల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు జిల్లాలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో క్రియా ప్రయోగశాలలను స్థాపించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. రెండు ల్యాబ్‌లను తాజాగా ప్రారంభించినట్లు' ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఎండీ, సీఈవో దేబాశిశ్ మిశ్రా వెల్లడించారు. ఆయన శనివారం స్టేషన్ రహదారిలోని ఒక ప్రైవేటు హోటల్ సభా భవనంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం దేశ వ్యాప్తంగా గుర్తించిన మహత్వకాంక్ష జిల్లాల్లో రాయచూరు ఉన్నందునే ప్రాధన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ, పాఠ్యాంశాలతో అనుసంధానమైన క్యురేటెడ్ కోర్స్‌వేర్, నిరంతర మార్గదర్శనం ద్వారా విద్యా సబలీకరణ కార్యక్రమాలను అమలు చేయటానికి సిద్ధమవుతున్నట్లు వివరించారు. అవసరమైన సేవలు అందిస్తున్న, సౌలభ్యాలు దక్కనివారికి చేయూతనిచ్చే సంస్థలతో కలిసి సీఎస్ఆర్ ఉపకార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. లిమిటెడ్ అధికారి రజత్ గ్రోవర్, సీఎస్ఆర్ ముఖ్యుడు నిశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

మాన్వి, న్యూస్‌టుడే: క్రీడలు ఆరోగ్యం, మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ పదవి కళాశాల డైరెక్టర్ నరసప్ప తెలిపారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చెంద్ జయంత్యోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక లయోలా కళాశాలలో వివిధ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. ధ్యాన్‌చెంద్ దేశ క్రీడారంగానికి చేసిన సేవలను గుర్తుచేశారు. లయోలా కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ వినోద్‌పాల్ మాట్లాడుతూ..జాతి ధర్మాలకు అతీతంగా దేశాన్ని ఐక్యం చేసే శక్తి క్రీడలకుందన్నారు. ఇక్కడ క్రీడా స్ఫూర్తి, ప్రతిభకు మాత్రమే అవకాశముందన్నారు. క్రీడల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలను బహుకరించారు. ఖాసీంఖాన్, విఠల్‌గావడె, జాకీర్‌పాషా, దేవణ్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడలో తలబడుతున్న విద్యార్థుల జట్లు

సిగరెట్ కాల్చొద్దన్నందుకే హత్య

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్), న్యూస్‌టుడే : బహిరంగ ప్రదేశంలో సిగరెట్ తాగకూడదని సూచించిన హరీశ్‌పై దాడి చేసి, హత్య చేసిన ఎనిమిది మంది నిందితులకు 58వ అదనపు సిటీ సివిల్, సెషన్స్ కోర్టు జీవిత ఖైదు శిక్షను విధించింది. వివేకనగరకు చెందిన జెరాల్డ్ ఆరోగ్య రాజ్, జేమ్స్‌కుమార్, వెంకటేశ్, విజయ్, కిరణ్, విక్రం, వినోద్‌కుమార్, విజయ్ శిక్షకు గురైన నిందితులు. శాంతినగర బి స్ట్రీట్‌లో హరీశ్ (32)ను 2017 అక్టోబరు 1న హత్య చేశారు. నేరం రుజువు కావడంతో వారికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

ప్రాథమిక కేంద్రాల్లో మెరుగైన సేవలు

బాలింతల వార్డులో డీహెచ్‌ఓ

రాయచూరు, న్యూస్‌టుడే: ప్రాథమిక, సముదాయ ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న మెరుగైన ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీహెచ్‌వో డాక్టర్ నందితా కోరారు. ఆమె శనివారం రాయచూరు తాలూకాలోని గుంజళ్లి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. బాలింతల వార్డు, ఔషధ గోదాము, ప్రయోగశాలను పరిశీలించారు. శిశువుకు 6 మాసాలు తల్లిపాలు ఇవ్వాలని, సకాలంలో టీకాలను వేయించాలని, పోషకాహారాన్ని తీసుకోవాలని తల్లులకు సూచించారు. రోగులతో ఆప్యాయంగా మాట్లాడాలని, జీవ రక్షక మందులు కొరత లేకుండా చూసుకోవాలని వైద్యాధికారికి సూచించారు.

పాదయాత్ర.. తగ్గేదేలే

పోస్టర్లను ప్రదర్శిస్తున్న శ్రీరాములు, ఇతర నేతలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా చేసినా లింగసుగూరు నుంచి బళ్లారి వరకు పాదయాత్ర కొనసాగిస్తామని భాజపా నేత, మాజీ మంత్రి బి.శ్రీరాములు స్పష్టం చేశారు. సెప్టెంబరు 1 నుంచి 10 వరకు కొనసాగే పాదయాత్రకు జనతాదళ్ నేతలు, కార్యకర్తలు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. కేంద్ర మంత్రులు కుమారస్వామి, ప్రహ్లాద్ జోషి తమ యాత్రలో పాల్గొంటారని వివరించారు. పాదయాత్ర లాంఛనాన్ని పార్టీ ప్రధాన కార్యాలయం జగన్నాథ భవన్‌లో ఆయన విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ నేతల అక్రమాలు, మహర్షి వాల్మీకి కార్పొరేషన్‌లో అక్రమాలతో వచ్చిన నగదు వితరణ చేసి తమ ప్రాంతంలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారని ఆరోపించారు. మస్కి, సింధనూరు, కారటగి, గంగావతి, కంప్లి, సండూరు, బళ్లారి గ్రామీణ నియోజకవర్గాల నుంచి చివరిగా బళ్లారికి చేరుకుని అక్కడ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని వివరించారు. తన పదవికి రాజీనామా చేసిన సందర్భంలో నాగేంద్ర కన్నీరు కార్చారని, దానికి కాంగ్రెస్ కారణమన్నారు. భాజపా 2013లో అధికారంలోకి వచ్చినప్పుడు తమతోనే ఉన్న నాగేంద్ర..కుంభకోణంలో దళిత సముదాయానికి చెందిన అధికారి చంద్రశేఖర్ ఆత్మహత్యకు నాగేంద్ర బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

'హనూరు' నివేదిక సిద్ధం

నివేదిక అందుకుంటున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : హనూరు తాలూకా కావేరి వన్యధామలో ఆగస్టు 15న వేకువ జామున సంభవించిన కాల్పుల ఘటనకు సంబంధించి సిద్ధం చేసిన నివేదికను జిల్లాధికారి శ్రీరూప ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్‌కు శనివారం అందజేశారు. కరడికల్లు గుడ్డ వద్ద కాల్పుల్లో ఆంథోణి స్వామి, పీటర్, కుమార్ అనే వ్యక్తులు మరణించారు. ఇది ఎదురు కాల్పులు కాదని, ఎన్‌కౌంటర్ అని ఆంథోణి స్వామి భార్య లూర్దా మేరి ఆరోపించడంతో ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. నివేదికను పరిశీలించి, దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని శాలిని రజనీశ్ తెలిపారు.

వైభవంగా హనుమాన్ పల్లకీ సేవ

ఉత్సవంలో పాల్గొన్న హనుమభక్తులు

మాన్వి, న్యూస్‌టుడే: ఇక్కడికి సమీపంలోని బల్లటగి అంచేటి ఆంజనేయ స్వామివారి దేవస్థానానికి నూతన హనుమాన్ వెండి విగ్రహం, పల్లకి సమకూరాయి. ఆలయంలో విశేష పూజలు నిర్వహించి, స్వామివారి కొత్త వెండి విగ్రహాన్ని నూతన పల్లకిలో పెట్టి ఊరేగించారు. దేవస్థానం ప్రాంగణంలో హోమ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రముఖులు అరుణ్‌కుమార్ నాయక్, వెంకటేశ్ సిరివార, రంగారెడ్డినాయక్, గోవిందప్ప పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

29-08-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1630.62	1626.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	9,343	36,726
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8,905	38,894
నీటి నిల్వ (టి.ఎం.సి)	96.419	79.798

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

విద్యార్థులను వెంటాడుతున్న విషాహారం

తల్లీపిల్లల ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న విద్యార్థినులను పలకరిస్తున్న ఎమ్మెల్యే బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే : సింధనూరు ప్రభుత్వ వసతి నిలయాల్లో విద్యార్థులను విషాహారం సమస్య వదలడం లేదు. నెల తిరగకుండా మూడోసారి ఈ ఘటన చోటుచేసుకుంది. శనివారం ఉదయం అల్పాహారంగా తీసుకున్న చిత్రాన్నం స్థానిక టౌన్ పోలీసు స్టేషను ఎదురుగా ఉన్న అంబేడ్కర్ హాస్టలు హైస్కూలు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. తింటున్న ఆహారంలో ఇనుప ముక్కలు, ఇతర వ్యర్థాలు కనిపించాయి. కొద్దిసేపట్లోనే వాళ్లకు వాంతులు కావడంతో దశలవారీగా మొత్తం 30 మంది విద్యార్థులను పీడబ్ల్యూడీ క్యాంపులోని ఎంసీహెచ్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఎవరికీ ప్రమాదం లేదని, సాయంత్రానికి కోలుకుంటారని ఆసుపత్రి ముఖ్య వైద్యురాలు కావేరి వెల్లడించారు. విషయం తెలుసుకుని ఎమ్మెల్యే బాదర్లి, ఎమ్మెల్సీ బసనగౌడ, భాజపా నాయకుడు కె.కరియప్ప, మాజీ మంత్రి నాడగౌడ ఆసుపత్రికి వేంచేసి విద్యార్థినుల యోగక్షేమాలను వాకబు చేశారు. ఎమ్మెల్యే అక్కడే విలేకరులతో మాట్లాడుతూ వసతి నిలయాల్లో తరచూ ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసుకుని తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అధ్యక్షుడి రాక

రాయచూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ అధ్యక్షుడు డాక్టర్ మూర్తి జిల్లాలో 2 రోజులు పర్యటిస్తారని సాంఘిక సంక్షేమ అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. హద్దినాళ, హొక్రాణి, కరడకల్ గ్రామాల్లో హత్యలకు గురైన బాధిత కుటుంబాలతో ఆదివారం భేటి అవుతారు. మధ్యాహ్నం నుంచి వసతి నిలయాలను సందర్శిస్తారు. సోమవారం ఉదయం నగరంలోని జిల్లా పంచాయతీ సభాభవనంలో ఉన్నతాధికారులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి అధికారులతో ప్రగతిని సమీక్షిస్తారు.

క్రీడలతో ఉల్లాసం, ఉత్తేజం

ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న అర్పిస్తున్న అధికారులు

రాయచూరు, న్యూస్‌టుడే: శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని కల్గించే, ఆరోగ్యవంతులుగా మార్చే క్రీడలను నిత్య జీవితంలో ఒక భాగం చేసుకోవాలని మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య శివానంద కెళగమని సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వీవీ బోధక, బోధనేతర సిబ్బందికి వర్సిటీ మైదానంలో ఆటల పోటీలను నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యానచంద్ చిత్రపటానికి ఉపకులపతి పూలమాల వేసి, అధికారులతో కలిసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ విధుల ఒత్తిళ్లు ఉన్నా కొంత సేపైనా ఇష్టమైన క్రీడను ఆడాలని సూచించారు. ఎక్కడ పోటీలు జరిగినా ఉత్సాహంగా పాల్గొనడం అలవరచుకోవాలని సలహా ఇచ్చారు. రిజిస్ట్రార్ చెన్నప్ప మాట్లాడుతూ ఆటల వల్ల నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని వివరించారు. మూల్యాంకనం రిజిస్ట్రార్ జ్యోతి ధమ్ ప్రకాష్, డీన్‌లు పార్వతి, భాస్కర్, వెంకటేష్, బిరాదార్, క్రీడా విభాగం ముఖ్యురాలు లతా హాజరయ్యారు.

(c) eenadu